

కిర్గిస్థాన్‌లో జిల్లా విద్యార్థులు

- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న వైనం
- ఆందోళనలో తల్లిదండ్రులు

... మెయిన్‌లో


కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో పెందుర్తి ప్రాంత వైద్య విద్యార్థులు

ఎన్నికల వేళ... యూజర్ చార్జీలకు బ్రేక్





వసూలును నిలిపివేసిన జీవీఎంసీ

- గత ఏడాది నవంబరులో 32 శాతానికిపైగా వసూలు
- మార్చిలో ఆరు శాతం.. ఏప్రిల్‌లో 2.99 శాతం మాత్రమే
- వైసీపీ ఓట్లకు గండిపడకూడదనే నిర్ణయం?
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ఎన్నికల విధుల్లో బిజీయే కారణమన్న యంత్రాంగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'మాపై యూజర్ చార్జీల భారం మోపొద్దు బాబోయ్.. భారం మోయలేమని' నగరవాసులు నెత్తినోరూ మొత్తుకున్నా ససేమిరా అని ముక్కుపిండి మరీ వసూలు చేసిన జీవీఎంసీ అధికారులు... రెండు నెలలుగా ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించడం చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల్లో వైసీపీ ఓట్లకు గండి పడకూడదనే భావంతోనే అధికారులు యూజర్ చార్జీల వసూలును నిలిపివేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో చెత్తసేకరణ, వాటి నిర్వహణ శాస్త్రీయంగా నిర్వహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యూజర్ చార్జీలు వసూలు చేయాలని రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలను ఆదేశించింది. జీవీఎంసీ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించడంతోపాటు, దుకాణాలు, హోటళ్లు, పార్లర్లు వంటి వాణిజ్యపరమైన ప్రదేశాలకు వద్దకు వెళ్లి చెత్తసేకరించేందుకు 'క్లీన్ ఆంధ్రప్రదేశ్' (క్లాప్) పేరుతో 640 వాహనాలను జీవీఎంసీకి కేటాయించింది. వీటి నిర్వహణకు అయ్యే ఖర్చులను ప్రజల నుంచి యూజర్ చార్జీల రూపేణా వసూలుచేసుకునే వెసులుబాటును కూడా జీవీఎంసీకి కల్పించింది.

రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు జీవీఎంసీ అధికారులు 2021 జూన్‌లో యూజర్ చార్జీల వసూలు చేసేందుకు వీలుగా కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. నివాసితుల నుంచి నెలకు రూ.120 చొప్పున, మురికివాడల్లో మాత్రం రూ.60 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. హోటళ్లు, రెస్టారెంట్‌లు, పార్లర్లు వంటి వాణిజ్యపరమైన అసెస్‌మెంట్‌లకు మాత్రం వాటిస్థాయిని బట్టి యూజర్ చార్జీలను నిర్ణయించారు. దీని ప్రకారం జీవీఎంసీ పరిధిలో 6,04,264 అసెస్‌మెంట్ల నుంచి నెలకు రూ.5.8కోట్లు వసూలు అవుతుందని అధికారులు అంచనా వేశారు. 2021 నవంబరు నుంచి యూజర్ చార్జీల వసూలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవడంతో అధికారులు మొదట్లో ఆచితూచి వ్యవహరించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరగడంతో జీవీఎంసీ అధికారులు స్పెషల్‌డ్రైవ్ మాదిరిగా యూజర్ చార్జీల వసూలు బాధ్యతలను తీసుకున్నారు. వార్డు సచివాలయం ఉద్యోగులతోపాటు వార్డు వలంటీర్లను భాగస్వాములను చేసి యూజర్ చార్జీల వసూళ్లకు టార్గెట్‌లు విధించారు. అయినప్పటికీ ప్రజల నుంచి తిరుగుబాటు కొనసాగడంతో సంక్షేమ పథకాలు అందుకునే లబ్ధిదారులకు యూజర్ చార్జీలను ముడిపెట్టి పథకాలను నిలిపేస్తామని బెదిరింపులకు కూడా దిగారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో కొంతమంది యూజర్ చార్జీలను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

గత ఆరు నెలల్లో యూజర్ చార్జీలు వసూళ్లు

నెల	వసూలైన మొత్తం	శాతం
నవంబరు	1,88,35,711	32.3
డిసెంబరు	1,29,69,030	22.26
జనవరి	55,31,160	9.48
ఫిబ్రవరి	84,33,040	14.44
మార్చి	34,94,600	6.0
ఏప్రిల్	17,47,300	2.99

ఎన్నికల వేళ... ఆచి తూచి...

నగరంలో యూజర్ చార్జీలు వసూలు ప్రారంభించిన మొదటి నెల (2021 నవంబరు)లో 1.48 శాతంతో మొదలవగా, గత ఏడాది మే నాటికి దాదాపు 50 శాతానికి చేరింది. ఆ తర్వాత 2024 సాధారణ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో యూజర్ చార్జీల వసూలు విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. దీంతో వసూలుశాతం తగ్గుతూ ... మిగతా 6వ పేజీలో

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

జూలై నుంచి చేపట్టేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు

- ఇప్పటికే జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్లకు ముగిసిన తర్ఫీదు
- త్వరలో సిబ్బందికి అందనున్న శిక్షణ


హెల్త్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి):

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించేందుకు వీలుగా మరోసారి ఇంటింటి సర్వే చేపట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. గతంలో నాన్ కమ్యూనకబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ), ఎన్‌సీడీ 2.ఓ పేరుతో సర్వే నిర్వహించిన ఆరోగ్యశాఖ.. మరో విడత ఇంటింటి సర్వేకు సిద్ధమవుతోంది. ఎన్‌సీడీ 3.ఓ పేరు జూలై మొదటి వారం నుంచి ఈ సర్వేను చేపట్టనుంది.

ఇంటింటి సర్వేలో భాగంగా 18 ఏళ్లు పైబడిన వారి ఆరోగ్య వివరాలను సేకరించనున్నారు. బీపీ, షుగర్, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి వ్యాధులతోపాటు కేన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. రొమ్ము, సర్వైకల్, ఓరల్ కేన్సర్ నిర్ధారణకు సంబంధించి ఆరోగ్యశాఖ సిబ్బంది రోగుల ఇళ్ల వద్దే స్క్రీనింగ్ చేపట్టనున్నారు. ఆరోగ్యశాఖకు చెందిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారు. రోగుల వివరాలను వీరికి కేటాయించిన యాప్‌లో పొందుపరుస్తారు. ఆయా గ్రామాల కు కేటాయించిన పీహెచ్‌సీలోని వైద్యులు (ఫ్యామిలీ ఫిజీషి యన్ కాన్సెప్ట్) రోగులు వివరాలను పరిశీలించి, అవసరమ నుకుంటే మెరుగైన పరీక్షలు, వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా రిఫరల్ ఆస్పత్రులకు, ఆరోగ్యశాఖ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించనున్నారు.

త్వరలో సిబ్బందికి శిక్షణ

ఎన్‌సీడీ 3.ఓ సర్వే నిర్వహణకు సంబంధించి జిల్లాస్థాయి లో ఒక అధికారి ఇప్పటికే శిక్షణ తీసుకుని వచ్చారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో సర్వే నిర్వహించనున్న ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ అందిస్తారు. ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి లో సర్వే నిర్వహించే సిబ్బందికి శిక్షణ పూర్తి చేయనున్నట్టు ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్‌సీడీ 3.ఓ సర్వేలో పూర్తిగా కేన్సర్‌కు సంబంధించిన అంశాలపై దృష్టిసారిస్తారు. ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేన్సర్ స్క్రీనింగ్ చేయడానికి అధిక ప్రాధాన్యతనిచ్చేలా ఆదేశాలు అందాయని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

అదుపు చేయడంపైనే దృష్టి..

ఇటీవల దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్న వయసులోనే షుగర్, బీపీ వంటి సమస్యలు చుట్టుముట్టడం, కేన్సర్ మహమ్మారి విజృంభిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సకాలంలో కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రోగులను తప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేను చేపడుతున్నాయి. దీని ద్వారా వీలైనంత వరకు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని ముందుగానే గుర్తించి, మెరుగైన వైద్యసేవలు అందించేం దుకు అవకాశం ఉంటుందని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ... మిగతా 6వ పేజీలో


సందర్శకులతో కిక్కిరిసిన రుషికొండ బీచ్

తీరం... జన సంద్రం

సందర్శకులతో కళకళలాడిన బీచ్‌లు

సార్వత్రిక ఎన్నికలు ముగియడం, వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు నగరానికి భారీగా చేరుకుంటున్నారు. రెండు రోజులుగా విపరీతమైన ఎండ, దానికి తోడు ఉక్కపోతతో అల్లాడిపోతున్న నగరవాసులు కూడా సాయంత్రం సమయానికి తీరానికి చేరిపోతున్నారు. దీంతో బీచ్‌లన్నీ కిటకిటలాడుతున్నాయి. సాగర్‌నగర్, తెన్నేటి పార్కు, ఉడా పార్కు, ఆర్‌కే బీచ్‌లు ఆదివారం సాయంత్రం సందర్శకులతో కిటకిటలాడాయి. పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చిన పర్యాటకులు సాయంత్రం సమయానికి బీచ్‌లకు చేరుతున్నారు. రుషికొండ వద్ద బోటుషికార్ చేసి కెరటాలపై ఉల్లాసంగా తేలియాడారు. ఈ సందర్భంగా బీచ్‌రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ నెలకొంది. పాదచారులు రోడ్డు దాటేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి.

- సాగర్‌నగర్

7.74 శాతమే!

విమాననగర్ బూత్‌లో నమోదైన పోలింగ్

- ఎన్నికలకు దూరంగా నేవీ కుటుంబీకులు
- నేవీ క్వార్టర్స్‌లో 50 శాతం కంటే తక్కువగా పోలింగ్
- అత్యధికంగా గోపాలపట్నం ఇందిరానగర్‌లో 88.55 శాతం
- విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఓటింగ్ సరళి


తక్కువ సంఖ్యలో హాజరైన ఓటర్లు (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం/మల్కాపురం, మే 19:

జిల్లాలో అత్యధిక ఓట్లున్న విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు పోలింగ్‌లో వెనుకబడ్డాయి. ముఖ్యంగా నేవీ కుటుంబాలు ఉండే క్వార్టర్స్ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన బూత్‌లలో 50 శాతం కంటే తక్కువగా ఓటింగ్ జరిగింది. విమానాశ్రయం ఎదురుగా ఐఎన్‌ఎస్ డేగాలో పనిచేసే ఉద్యోగులు ఉండే విమాననగర్‌లో కేవలం 7.74శాతం మంది మాత్రమే ఓట్లు వేశారు. విమాననగర్ కోసం ఏర్పాటుచేసిన బూత్ నంబరు 213లో 620 మంది ఓటర్లుండగా కేవలం 48మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. బహుశా ఇక్కడే రాష్ట్రంలో అతి తక్కువ పోలింగ్ జరిగిందని చెబుతున్నా, అధికారికంగా ఎవరూ ప్రకటించలేదు.

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 222 పోలింగ్ బూత్‌లలో 2,13,439మంది ఓటర్లకుగాను 1,48,942 మంది (69.78 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిని పరిశీలిస్తే.. నేవీ కుటుంబీకులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువగా ఓట్లు పోలయ్యాయి. మర్రిపాలెం 104 ఏరియాలో ఉన్న బూత్ నంబరు 194లో 424మంది ఓటర్లకు 154 (36.32శాతం)మంది, మేహాద్రిపేట ప్రాంతంలో ఉన్న బూత్ నంబరు 171లో 375 మంది ఓటర్లకు 137 మంది (36.53శాతం), అశోకాపార్కు ఏరియాలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 178లో 274 మందికి 113 (41.24శాతం), మల్కాపురం నేవీ ఏరియాలో ఉన్న బూత్ నంబరు 160లో 466మంది ఓటర్లకు 200 మంది(42.92శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 50శాతం కంటే తక్కువగా ఏడుచోట్ల పోలింగ్ నమోదయింది. కాగా 51 నుంచి 60శాతం మధ్య 30 పోలింగ్ బూత్‌లు, 61 నుంచి 70శాతం మధ్య 62 బూత్‌లు, 71 నుంచి 80 శాతం మధ్య 98 పోలింగ్ బూత్‌లు, 80 శాతం దాటి 25 ... మిగతా 6వ పేజీలో

అనంతునికి చందనాలంకరణ


చందనాలంకృతుడైన కుంతీమాధవస్వామి

వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా పద్మనాభంలోని అనంత పద్మనాభునికి ఆదివారం చందనాలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి మూల విరాట్టును చందనంతో విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనాన్ని కల్పించారు. - వివరాలు 7లో

విస్కోలో ఇష్టారాజ్యం

చక్రం తిప్పుతున్న తాత్కాలిక ఉద్యోగి

- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతలూ అతడికే
- జీవీఎంసీలోని కీలక అధికారి అండతో హల్‌చల్
- ఐఏఎస్ అధికారి భవనానికి రూ.20 లక్షల అద్దె చెల్లింపులో కీలకం
- విస్కో నిధులతో వాహనం కొనుగోలు
- కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు
- ఇవ్వకపోతే వేధింపులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం ఇండస్ట్రియల్ వాటర్‌సప్లై కార్పొరేషన్(విస్కో)లో తాత్కాలిక ఉద్యోగి ఒకరు చక్రం తిప్పుతున్నారు. జీవీఎంసీలోని కీలక అధికారి అండదండలు పుష్కలంగా ఉండడంతో విస్కో ఉన్నతాధికారులను పక్కనపెట్టి హల్‌చల్ చేస్తున్నారు. విస్కోను సొంతజాగీరుగా మార్చుకుని, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతను లాగేసుకుని, విస్కో నిధులతో సొంత అవసరాలను తీర్చుకుంటున్నారు. అంతేకాకుండా అస్మదీయులకు ఎడాపెడా దోచిపెట్టి విస్కోను పూర్తిగా కబ్జా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరం, పరిసరాల్లోని పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు విస్కో పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేశారు. ఇది జీవీఎంసీ ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ కొన్ని ప్రత్యేక వెసులుబాట్లున్నాయి. ఈ సంస్థకు జీవీఎంసీ కమిషనర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తుండగా, చీఫ్ ఇంజనీర్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్‌గానూ, నీటిసరఫరా విభాగం ఎస్‌ఈ సీనియర్ జనరల్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు. స్టేక్‌హోల్డర్స్ ఎన్‌టీపీసీ, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, ఏపీఐఐసీ వంటి పరిశ్రమల ఉన్నతాధికారులు విస్కో లో సభ్యులుగా ఉంటారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి నగరానికి నీటిని తీసుకువచ్చేందుకు కాలువ తవ్వకానికి విస్కోనే నిధులు సమకూర్చింది. కాలువ నుంచి నగరానికి నీటి తరలిం పు, నిర్వహణ, నిధుల ఖర్చు బాధ్యతలను విస్కోనే పర్యవేక్షిస్తోంది. నీటిని తీసుకుంటున్నందుకు జీవీఎంసీతోపాటు స్టేక్‌హోల్డర్లుగా ఉన్న కంపెనీలన్నీ విస్కోకి చార్జీలు చెల్లిస్తాయి. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా కాలువ నిర్వహణ, రిజర్వాయర్‌లో పంపింగ్ వంటి పనులను విస్కో నిధులతోనే చేస్తుంటారు. పనుల ప్రతిపాదన, నిధుల ఖర్చులకు సంబంధించిన అంశాలపై విస్కో బోర్డు మీటింగ్‌లో సభ్యులంతా సమావేశమై ... మిగతా 6వ పేజీలో

పారితోషికంలో మతలబులు!

- ఒక్కో జిల్లాలో ఒక్కోలా చెల్లింపులు
- జిల్లాలో పీవోకు రూ.1750, ఇతర జిల్లాల్లో రూ.2500 వరకు చెల్లింపు
- పోలింగ్ రోజున రుచీ పచీ లేని భోజనాలు
- నిబంధన మేరకే ఇచ్చామంటున్న అధికారులు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్కో జిల్లాలో ఒక్కోలా పారితోషికం అందింది. అధికారుల తీరుతోనే ఇలా జరిగిందని సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలో పీవోలకు రూ.350 చొప్పున ఐదు రోజులకు రూ.1750 ఇచ్చారు. అదే అనకాపల్లిలో రూ.2050, శ్రీకాకుళంలో రూ.2,450, నెల్లూరులో రూ.2500 చెల్లించారు. దీనిపై ఉద్యోగుల వాట్సాప్‌గ్రూప్‌లలో చర్చ సాగుతోంది. దీనికితోడు పోలింగ్ రోజున భోజనాలు రుచిగా లేవని, ఈవీఎంలు తీసుకువచ్చిన రాత్రి బూత్‌ల వద్ద తాగునీరు కూడా లభించలేదని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు.

జిల్లాలో పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈనెల 13న పోలింగ్ జరిగింది. 1,991 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేసిన అధికారులు, ఎన్నికల నిర్వహణకు 15వేల మంది ఉద్యోగులను నియమించారు. మూడు విడతలుగా వారికి శిక్షణ ఇచ్చారు. పోలింగ్ నిర్వహణకు ఈనెల 12న మెటీరియల్ తీసుకుని కేంద్రాలకు వెళ్లిన ఉద్యోగులు 13న పోలింగ్ చేపట్టారు. ఎక్కువ చోట్ల 13వ రాత్రి వరకు పోలింగ్ జరగడంతో అక్కడి నుంచి ఈవీఎంలు తీసుకుని ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చేరేసరికి అర్ధరాత్రి దాటింది. అక్కడ ఈవీఎంలు, ఇతర సామగ్రి అప్పగించేసరికి 14వ తేదీ ఉదయం అయిందని చెబుతున్నారు. 12వతేదీ రాత్రి, 13న ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రుచిగా లేదని, వరుసగా మూడు రోజులు గొడ్డు చాకిరీ చేశామని, పోలింగ్ రోజు రాత్రి చాలామంది పస్తులున్నారని చెబుతున్నారు. తీరా పారితోషికంలో కోతలు పెట్టారంటున్నారు. ఈసీ నిబంధనల మేరకే ఇచ్చారని అనుకున్నామని, ఇతర జిల్లాల్లో అందిన మొత్తం చూస్తే తేడాలు తెలిశాయంటున్నారు. సెక్టారు ఆఫీసర్లు, నాలుగోతరగతి ఉద్యోగులకు ఇంకా పారితోషికం ఖరారుచేయలేదు. అయితే ఈసీ నిబంధనల మేరకు చెల్లించామని, పోలింగ్ కోసం ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు లెక్కించామని అధికారులు చెప్పడం గమనార్హం.

సాధనతోనే సంగీత కళాకారుల రాణింపు


అన్నమయ్య జయంత్యుత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ద్వారం త్యాగరాజు

సీతంపేట, మే 19: సరస్వతీ దేవి ప్రతిరూపమైన సంగీతాన్ని భక్తిశ్రద్ధలతో ఏకాగ్రతగా సాధన చేసిన వారే మంచి కళాకారులుగా రాణిస్తారని డాక్టర్ ద్వారం త్యాగరాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శృతిలయ వ్యవస్థాకులు వి.ప్రభాకర్ సారథ్యంలో ఆదివారం వాగ్గే యకారుడు అన్నమాచార్యుని జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అన్నమాచార్య సంకీర్తనల పోటీలను నిర్వహించారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 300 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ద్వారం త్యాగరాజు జ్యోతి మాట్లాడుతూ తేనె వంటి తెలుగు పదాలతో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని తన సంకీర్తనలతో కీర్తించిన ఘనత ఒక అన్నమాచార్యునికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎంఎస్ మాధవ్, కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, కె. మంజుల, శారద, సుజని తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆర్పీపేట పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

కంచరపాలెం, మే 19 : జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో 2006-2007 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకుని సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాలను విడిచి 17 ఏళ్లు గడిచినా అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు. నగరంతో పాటు రాష్ట్రం నలుమూలల ఉన్న విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలోపాల్గొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులు నారాయణరావు, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, అరుణకుమారి, హేనా, హరినాథ్,శ్వేత తదితరులను ఘనంగా సత్కరించారు. వారు నేర్పిన విద్యాబుద్ధులను గుర్తు చేసుకున్నారు. కుటుంబాలతో సందడిగా గడిపారు. డ్యాన్స్‌లతో ఉల్లాసంగా ఆనందం పంచుకున్నారు.

45 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న దాతలు

సీతమ్మధార, మే 19: నక్కవానిపాలెంలో ఏఎంసీ ఆసుపత్రి ఎదురుగాఉన్న భవనంలో పీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లైన్ బ్లడ్ బ్యాంక్ ట్రస్టు వైద్యులు పర్యవేక్షణలో దాతల నుంచి రక్తం సేకరించారు. సుమారు 45 మంది రక్తదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ పీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ సేవా కార్య క్రమాల్లో భాగంగా, స్వామి రవిశంకర్ 68వ జయంతిని పురస్కరించుకొని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ వి.సాంబశివరావు, సెక్రటరీ వీవీ రమణమూర్తి, కోశాధికారి జీ సాంబమూర్తి, పీ శ్రీనివాసరావు, లైన్‌బ్లడ్ బ్యాంక్ వైద్యులు సయ్యద్, సహాయకులు ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కంచరపాలెం, మే 19 : యువతి అదృశ్యంపై కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ల కేసు నమోదైంది. కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి జ్ఞానాపురం రాచవీధిలో నివాశంఉంటున్న కన్నెకంటి పద్మ భర్తతో విడిపోయి కుమార్తె కీర్తిక, బాబుతో కలిసి ఉంటున్నారు. కీర్తిక పదోతరగతి వరకు చదివి మధ్యలో ఆపేసి బట్టలదుకాణంలో పనిచేస్తుండేది. అయితే, బట్టల దుకాణం యజమాని ఇవ్వాల్సి డబ్బులు తీసుకువస్తానని తల్లికి చెప్పి శుక్రవారం మధ్యాహ్నం కీర్తిక బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి పద్మ బంధువులు, చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యతను గాలికొదిలేశారు!

- 48ఏ బస్సు రూట్‌లో రూ. 9 కోట్ల నిధులతో రహదారి నిర్మాణం
- మూడు నెలలకే పలుచోట్ల ధ్వంసం
- నాసిరకంగా రోడ్డు మధ్య మ్యాన్‌హోల్ పనులు
- పెచ్చులూడుతున్న రోడ్డు అంచులు

మాధవధార, మే 19 ; విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధి 48ఏ బస్సు రూట్‌లో ఇటీవల రూ. 9 కోట్ల నిధులతో నిర్మించిన రహదారి ఎక్కడిక్కడ మరమ్మతులతో అధ్వానస్థితిలో దర్శనమిస్తోంది. మాధవధార, ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి మురళీనగర్, కైలాసపురం మీదుగా సీతమ్మధార వరకు వేసిన ఈ బీటీ రోడ్డు మధ్యలో యూజీడీ మ్యాన్‌హోల్స్ క్యాప్‌లు ధ్వంసమవడంతో వాటిని ఆనుకుని ఉన్న రహదారి క్రమేపీ దెబ్బతింటోంది. దీంతో రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక, మధ్యలో మరోసారి తవ్వకాలు చేపట్టి యూజీడీ మ్యాన్‌హోల్‌పై సిమెంట్ క్యాపులకు అతుకులు వేస్తున్నారు. ఈ ప్రదేశాల వద్ద నిర్మాణం పూర్తయిన రెండు నెలలకే చిందరవందరగా తయారయ్యాయి. ఈ నాణ్యత లోపించిన క్యాపుల నిర్మాణాలను చూస్తున్న వాహనదారులు, స్థానికులు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం వీటి నిర్వహణను తిరిగి మంచినీటి సరఫరా విభాగం ఏఈకి బదలాయించడంతో ఆ పనులు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంతో కలసి మళ్లీ పూర్తి చేస్తున్నారు. తొలుత కాంట్రాక్టులు రెండుగా విభజించి టెండర్లు కేటాయించి నిర్మాణం పూర్తిచేశారు. మాధవధార నుంచి ఆర్‌అండ్‌బీ వరకు 1.9 కిలోమీటర్లు, రెండోది మాధవధార నుంచి కైలాసపురం వరకు నిర్మించారు. అంతకు ముందు అక్కడి నుంచి సీతమ్మధార వరకు మరో కాంట్రాక్టుగా రోడ్డు పనులను త్వరత్వరగా ఎన్నికల ముందు జనవరిలోనే పూర్తి కానిచ్చారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ గడిచి


ఉడా కాలనీ బస్టాపు ఎదుట చేపడుతున్న మరమ్మతులు

ప్రస్తుతం మే నెల వచ్చే సరికి రోడ్డు రూపు మారి నిర్మాణాల్లో డొల్లతనం బయటపడుతోంది. మ్యాన్‌హోల్స్ క్యాపుల నుంచి సిమెంటు క్రషరు రాలి పోతున్నాయి. క్యాపుల చుట్టూ ఉన్న రోడ్డు అంచులు రాళ్ల పిక్కలు తేలి గోతులుగా మారింది. వీటిని కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు జీవీఎంసీ వాటర్ సప్లయి ఏఈ, ఇంజనీరింగ్ విభాగాల పర్యవేక్షణలో పనులు చేస్తున్నారు. విరిగిన మ్యాన్‌హోల్ క్యాపుల స్థానంలో కొత్త వాటిని అమరుస్తూ పనులు ఆరంభించారు. శనివారం మాధవధార ఉడాకాలనీ రోడ్డులో పనులు చేపట్టారు. అదే వరుసలో ఎన్‌జీజీఓస్ కాలనీ, మురళీనగర్, మధుసూదన్‌నగర్ వరకు మరమ్మతు పనులు కానిస్తుండడం గమనార్హం.

ఘనంగా నూకాంబిక పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న కేకే రాజు తదితరులు

కంచరపాలెం, మే 19: జీవీఎంసీ 47వార్డు పరిధి పెదకొత్తూరులోని శ్రీ నూకాంబిక అమ్మవారి నెలవారి పండగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి భక్తులు ఘటాలతో ఊరేగింపు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. ఆది ఆంధ్ర యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఉత్తర వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు, చొక్కాకుల వెంకటరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ పురోభివృద్ధికి పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమౌళి

మురళీనగర్, మే 19 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి పేర్కొన్నారు. క్లబ్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల క్లబ్ నిర్వహణలో చిన్నారులకు ఉచిత చదరంగం శిక్షణను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. అలాగే, ఈనెల 23న క్లబ్‌లో బుద్ధ పౌర్ణమి, 26న ఉచిత వైద్యశిబిరం, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే, సభ్యులందరి సహకారంతో విరాళాల సేకరించి పార్కు నిర్వహణ ఫండ్ మరింత పెంచేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా వాకర్స్ ఇంటర్నేషన్ సాయంతో సొంత భవనం నిర్మాణం చేపట్టనున్నట్టు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు కార్యక్రమాల నివేదికను వెల్లడించారు. కోశాధికారి వాకర్ జె.కూర్మారావు రాబడి, ఖర్చుల వివరాల్ని క్లబ్ సభ్యులకు నివేదించారు. సమావేశంలో పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాధం, ఎం.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు


ఓ కాశివాసి రావయ్యా నాటికలో ఓ సన్నివేశం

కొత్తూరు, మే 19 : అనకాపల్లిలోని వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. పరిషత్ నిర్వాహకుడు పీసీహెచ్. నాయుడు, కేఎం నాయుడుల పర్యవేక్షణలో విశాఖపట్నం కాలాభినయ కళాకారులు ప్రదర్శించిన "ఓ కాశివాసి రావయ్యా", విజయవాడ హర్ష క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన "మనఃసాక్షి" నాటికలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఓ కాశివాసి రావయ్యా నాటిక మానవత్వపు విలువలు లోపిస్తున్న ఈ సమాజంలో ఎవరికి వాళ్లే కొరివి పెట్టుకునే రోజు వస్తుందని, రేపటి రోజును ఈ రోజే ఊహించి రాసిన నాటిక ఇది. అలాగే, మనఃసాక్షి.. ప్రతి మనిషికి మనఃసాక్షి ఉంటుంది. అది కుటుంబ సంస్కారాలు, సంప్రదాయాల వలన రూపుదిద్దుకుంటుంది. కానీ చంద్రశేఖర పాత్ర తన మనఃసాక్షికి భిన్నంగా ధనార్జనే జీవిత ధ్యేయంగా అక్రమంగా సంపాదిస్తుంటాడు. అదే డబ్బు కోసం తన కొడుకు తండ్రి పంథాలో నడిచి తనకి కీడు చేస్తాడు. చంద్రశేఖరం పశ్చాతపడి డబ్బు శాశ్వతం కాదని నిర్ణయానికి వస్తాడు. మనిషికి కావాల్సింది పిడికెడు మెతుకులు జానెడుగుడ్డ, ఆరడుగులు నేల మాత్రమే మనిషికి శాంతినిస్తుందనే సందేశాన్ని తెలిపేది 'మనఃసాక్షి' నాటిక.ఈ నాటికకు రచన కీర్తిశేషులు డాక్టర్ పి.బ్రహ్మానందరావు, దర్శకత్వం కత్తి శ్యాంప్రసాద్ వహించారు.

కమనీయం... శ్రీవారి కల్యాణం


వేదికపై కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న పండితులు

మురళీనగర్, మే 19 ; నగరంలో ప్రసిద్ధి చెందిన మురళీనగర్ శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 22వ వార్షిక కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై మలయప్ప కల్యాణ వేడుకను ప్రధాన అర్చకులు శేషస్వామి ఆధ్వర్యంలో పూర్తిచేశారు. నగరంలోని పలు ప్రాంతాలు సహా మాధవధార, మర్రిపాలెం, మురళీనగర్, కంచరపాలెం ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తులు వేడుకల్లో హాజరయ్యారు. ఆలయ ఈవో బండారు.ప్రసాద్ ఉత్సవ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

హెచ్ఐవీ బాధితులకు అండగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతంపేట, మే 19: అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినం సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గర్తుకు చేసుకుంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రా త్రి డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తన కార్యాలయం వద్ద ప్రారంభించారు. అనంతరం సత్యం కూడలి వరకు అక్కడి నుంచి రామాటాకీస్ వరకు ఈ ర్యాలీ సాగింది. ప్రేమ, సంఘీభావం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం అనే నినాదంతో ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఈ వ్యాధితో బారిన పడిన వారికి పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందించడమే కాకుండా వారికి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయడ్స్ అండ్ క్షయ నిరవాణ అధికారి డాక్టర్ పుర్నేంద్రబాబు, జిల్లా విద్యా విస్తరణ మీడియా అధికారి శైలజా భద్రి, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంట నడిచిన వారందరికీ అండగా ఉంటా: గంటా

సిరిపురం, మే 19: భీమిలి అసెంబ్లీ ఎన్నికల్లో తన వెన్నంటి ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులందరికీ తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన ఇన్‌చార్జిలు, నాయకులు, శ్రేయోభిలాషులతో వాల్తేర్ క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. తన కోసం ఎంతో అభిమానంతో పనిచేసే ఎన్నికల టీమ్ ఉండటం తన అదృష్టమన్నారు. కుటుంబ సభ్యుడు పోటీ చేస్తుంటే ఎలా కష్టపడతారో అంతకుమించి తన విజయం కోసం శ్రమించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, జూన్ 4న ఫలితాలు రూపంలో అది కనిపించబోతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడం జూన్ 9న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం తథ్యమన్నారు. భీమిలి నుంచి పోటీ చేయడానికి నాలుగున్నరేళ్లు కష్టపడి పార్టీని నడిపించిన కోరాడ రాజబాబు ఎన్నికల సమయంలో ముందుండి పనిచేశారని ప్రశంసించారు. భీమిలి నుంచి జనసేన తరఫున పోటీ చేయాలని పంచకర్ల సందీప్ ఆశించి పొత్తులో ఆ సీటు టీడీపీకి వదిలేసినప్పటికీ పూర్తి సహకారం అందించారన్నారు. బీజేపీ ఇన్‌చార్జి రామునాయుడు నిరంతరం తన వెంటే ఉంటూ మిత్రపక్ష స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ వార్డుల ఇన్‌చార్జిలను గంటా సన్మానించారు.

విస్కోలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఆమోదించాల్సి ఉంటుంది. కొన్ని పనులకు మాత్రం జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం అవసరమవుతుంది.

అంతా అతనే...

విస్కో ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన ఓ ఉద్యోగిని నియమించారు. ఈ ఉద్యోగంలో చాలామంది పనిచేసి మానేయగా, ఐదేళ్ల కిందట చేరిన అతడు జీవీఎంసీలోని కీలక అధికారిని ప్రసన్నం చేసుకున్నారు. ఆ అధికారి అండదండలను అలుసుగా తీసుకుని తాత్కాలిక ఉద్యోగి విస్కోని తన జేబు సంస్థగా మార్చుకున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నీటిసరఫరా విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)కి విస్కో నుంచి కారుని సమకూర్చారు. తాత్కాలిక ఉద్యోగి కూడా అదే మాదిరి కారుని తన కోసం విస్కో నిధులతోనే కొనుగోలుచేసుకున్నారు. అంతేకాకుండా విస్కో పరిధిలో ఏవైనా పనులు చేయాల్సి వస్తే, బోర్డు సభ్యుల ఆమోదం మేరకు ప్రతిపాదనలు చేసి కమిషనర్ ఆమోదం తీసుకుంటారు. తర్వాత టెండరు పిలిచి కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయిస్తారు. బిల్లులను కమిషనర్ ఆమోదానికి, అక్కడి నుంచి విస్కోలోని ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షించే తాత్కాలిక ఉద్యోగికి పంపిస్తారు.

కొర్రీలతో కాలయాపన

అన్ని పనులు పూర్తైన తరువాత బిల్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఏదో ఒక కొర్రీ వేసి చెల్లింపులు జరగకుండా తాత్కాలిక ఉద్యోగి ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నేరుగా అతనిని కలిసి కమీషన్ ఇస్తేనే బిల్లుకు మోక్షం కలుగుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కీలక అధికారి అండదండలతో విస్కోలోని ఇతర అధికారులను ఈ తాత్కాలిక ఉద్యోగం లెక్కచేయడం లేదని బాధిత అధికారులే ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కీలక అధికారి చెప్పిన పనులన్నీ చేసి పెడుతుండడంతో తాత్కాలిక ఉద్యోగి ఆటలకు అడ్డుచెప్పడం లేదని ఆరోపిస్తున్నారు.

అడ్డగోలు వ్యవహారాలు

జీవీఎంసీకి అవసరం లేకున్నా కీలక అధికారి చెప్పారనే కారణంతో విశాలక్షినగర్‌లో ఐఏఎస్ అధికారి భవనాన్ని గెస్ట్‌హౌస్‌గా అద్దెకు తీసుకున్నారు. దీనికి విస్కో నుంచి నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్న విషయం టీడీపీ, జనసేన నేతలు బయటపెట్టారు. కౌన్సిల్‌లో ప్రతిపాదన పెట్టాల్సి ఉన్నప్పటికీ తాత్కాలిక ఉద్యోగి తానే నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన జీ-20 సదస్సుకు సంబంధించి నగరంలో పచ్చదనం పెంపు, సుందరీకరణ పనులను అర్బన్ గ్రీన్‌కార్పొరేషన్ చేపట్టింది. ఆ బిల్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ విస్కో నుంచి చెల్లించారు. దీనికి సంబంధించిన చెక్కు కూడా బయటపెట్టడంతో జీవీఎంసీ కీలక అధికారి చెప్పిన కాంట్రాక్టర్లకు విస్కో నిధులను ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరింది. విస్కో నిధులను కేవలం నీటిసరఫరాకు సంబంధించిన పనులకు మాత్రమే బోర్డు అనుమతితో వెచ్చించాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ కీలక అధికారికి సహకరించేందుకు ప్రైవేటు వ్యక్తిని నియమించుకున్నారు. ఆ ఉద్యోగి జీతాన్ని విస్కో నుంచే చెల్లించడం తాత్కాలిక ఉద్యోగి పెత్తనానికి నిదర్శమని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల వేళ... యూజర్‌చార్జీలకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. గత ఏడాది నవంబరు నాటికి 32 శాతం వసూలు కాగా, డిసెంబరుకు 22.26 శాతానికి, జనవరి నాటికి 9.48 శాతానికి, ఫిబ్రవరినాటికి 14.44శాతానికి, మార్చి నాటికి ఆరు శాతానికి, ఏప్రిల్‌నాటికి 2.99శాతానికి పడిపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అధికార పార్టీకి మేలు చేయాలనే...

యూజర్ చార్జీల వసూలులో ప్రభుత్వంపై ఆదినుంచీ నగర వాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ఎన్నికల్లో వైసీపీ ఓట్లకు గండిపడుతుందని నాయకులు గుర్తించారు. దీంతో ఎన్నికల హడావుడి ప్రారంభమయినప్పటి నుంచే యూజర్ చార్జీల వసూలుపై ఉదాసీనంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అప్పటివరకూ లక్ష్యం మేరకు యూజర్ చార్జీలను వసూలు చేయని వార్డు సచివాలయం ఉద్యోగులపై సస్పెన్షన్లు, చార్జిమెమోలు జారీచేయడం వంటి తీవ్రమైన చర్యలు తీసుకున్న అధికారులు ఒక్కసారిగా ఆ విషయాన్ని విస్మరించడం దీనికి బలాన్ని చేకూర్చింది. యూజర్ చార్జీలు చెల్లించాలని ఒకవైపు సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్తే... అదే సమయంలో గడపగడపకూ మన ప్రభుత్వం పేరుతో వెళ్లిన వైసీపీ నేతలు, అధికారులు తిరుగుబాటు ఎదుర్కొనాల్సి ఉంటుందని గ్రహించే, వైసీపీ నేతలు ఈ నిర్ణయం తీసుకుని ఉంటారనే అభిప్రాయం వినిపిస్తోంది. వైసీపీ ఓట్లకు గండిపడకుండా ఉండేలా అధికారులు కూడా తమ వంతు సహకారం అందించి, స్వామి భక్తిచాటుకున్నారని పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

7.74 శాతమే!

... 5వ పేజీ తరువాయి

పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు పడ్డాయి.

అత్యధికంగా గోపాలపట్నం ఇందిరానగర్ బూత్ నంబరు 13లో 88.55 శాతం ఓటింగ్ జరిగింది. ఇంకా గవర కంచరపాలెంలో బూత్ నంబరు 191లో 88.2 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇదిలావుండగా కంచరపాలెంలోని ఐటీఐ జంక్షన్‌లో హ్యాపీ ఓమ్స్, మర్రిపాలెం, కాకానినగర్, మల్కాపురంలో అపార్టుమెంట్ ప్రాంతాలకు చెందిన బూత్‌లలో పోలింగ్ శాతం తగ్గిందని రాజకీయపార్టీల ప్రతినిధులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఈ సర్వేతో అనారోగ్య సమస్య ఉందని తెలియని ఎంతోమందిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆశా, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో వివరించారు.

చిమ్మచీకట్లో డాబాగార్డెన్స్ వీధులు

- వెలగని వీధిదీపాలు
- నిద్రావస్థలో జీవీఎంసీ సిబ్బంది


అంధకారంలో లక్ష్మీస్ట్రీట్


ప్రేమ సమాజం రోడ్డులో వాహనదారుల రాకపోకలు

డాబాగార్డెన్స్, మే 19: గ్రేటర్ 31వ వార్డు డాబాగార్డెన్స్ లోని పలు ప్రాంతాల్లో సాయంత్రమైతేచాలు చీకటి కమ్ముకుంటోంది. లక్ష్మీస్ట్రీట్, శారదాస్ట్రీట్ డౌన్, ప్రేమ సమాజం రోడ్డులోని గాఢాంధకారం నెలకొనడంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే స్థానికులతోపాటు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారంతా అవస్థలు పడుతున్నారు. డౌన్ రోడ్డులోని ఒక్కసారి వాహనాలు రావడంతో ఎదుట ఎవరు వస్తున్నారో గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జీవీఎంసీ విద్యుత్‌దీపాల నిర్వహణ చూసే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కనీసం రాత్రి వేళలో వీధి దీపాలు వెలుగుతున్నాయో లేదోనన్న పర్యవేక్షణ లేకపోవడంతో తిప్పలు పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా కోరుతున్నారు.

2న ఐటీఐ బ్రిడ్జి కోర్సు అభ్యర్థులకు పరీక్షలు

కంచరపాలెం, మే 19 : ఐటీఐ కోర్సులు పూర్తిచేసి బ్రిడ్జి కోర్సు శిక్షణ తీసుకున్న అభ్యర్థులు డిప్లొమా ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు వచ్చే నెల 2వ తేదీన పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను సాంకేతిక శాఖ విడుదల చేసింది. గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పరీక్ష ఉంటుంది. రాష్ట్రంలో ఈ పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలను కేటాయించింది. జోన్ పరిధిలో విశాఖపట్టణం కంచరపాలెంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా పరీక్షలు జరగనున్నాయి. బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్స్ పాసైన అభ్యర్థులు ఈ పరీక్ష కోసం దరఖాస్తుకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు రూ.400 ను ఆన్‌లైన్ ద్వారా ఈనెల 20వ తేదీ 28వ తేదీ వరకు చెల్లించవచ్చు. జూన్ రెండో తేదీ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు గణితం, మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30 వరకు ఫిజిక్స్, 3.45 నుంచి 5.15 వరకు కెమిస్ట్రీ సబ్జెకుల్లో పరీక్షను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో నిర్వహించనున్నారు. ఈపరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం డిప్లొమా ఇంజినీరింగ్ రెండో ఏడాదిలోకి ఐటీఐ అభ్యర్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

25న జిల్లా మహిళల క్రికెట్ జట్ల ఎంపిక

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 19: జిల్లా అండర్- 15, 19 మహిళల క్రికెట్ జట్ల ఎంపికలు ఈనెల 25న నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కే పార్థసారథి తెలిపారు. వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో ఆరోజు ఉదయం 7.00 గంటల నుంచి జరిగే ఈ ఎంపికలుంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఈనెల 24వ తేదీలోగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీడీసీఏ కార్యాలయంలో వయస్సు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అండర్-15 విభాగంలో పాల్గొనేవారు సెప్టెంబరు ఒకటి, 2009న లేదా ఆ తర్వాత, అండర్-19లో పాల్గొనేవారు సెప్టెంబరు ఒకటి, 2005న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు.

అల్లర్లకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

సీతంపేట, మే 19: నాలు గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్ సూచనలతో ఎస్ఐ వెంకటరావు ఈ కార్య క్ర మం చేపట్టారు. ఈసందర్భంగా రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, ఎలాంటి అల్లరు చేయకూడదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరావు

'దక్షిణం'లో కూటమి అభ్యర్థి గెలుపు తథ్యం'

అక్కయ్యపాలెం, మే 19 : దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపు తథ్యమని 27వ వార్డు టీడీపీ కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. తమ వార్డులో 2500ల ఓట్ల మెజారిటీతో వంశీకృష్ణ విజయం సాధించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు కూడా విశాఖకు తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. వైసీపీ దుర్మార్గ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్ శాతం కూడా బాగా పెరిగిందని తెలిపారు.




సుందరయ్య చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

మల్కాపురం, మే 19: కమ్యూనిస్టు నేత, ప్రజల మనిషి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూనగర్, చింతలలోవ, క్రాంతినగర్‌లలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పైడి రాజు, పొన్నాడు రామారావు, పరదేశినాయుడులు పుచ్చలపల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడే సుందరయ్య సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమాల్లో జోన్ నాయకులు కె.పెంటారావు, ఆర్.విమల, పి.సురేశ్, గోపాల్, కె.రాము, దుర్గాప్రసాద్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: ప్రజలకు నిస్వార్థంగా సేవలందించి నిజాయితీపరుడైన నాయకునిగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్యను నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు కుమార్ అన్నారు. అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పుచ్చలపల్లి వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జె.కోటీశ్వరరావు, ఎ.లోకేశ్, సుబ్బన్న, శ్రీలక్ష్మి, డి.గోపి, తరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంటమాంబ ప్రధాన పండుగ



మల్కాపురం, మే 19: జింక్ గేటు సమీపంలోని హిమాచల్‌నగర్ వద్ద పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం జరగనున్న ప్రధాన పండుగతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా రోజూ అమ్మవారికి దీప, ధూప నైవేద్యాలతో పూజలు చేస్తున్నారు. సోమవారం ప్రధాన పండుగ సందర్భంగా అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నందున తగిన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు తెలిపారు.

దుర్గాలమ్మ పండుగ రేపు

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో కొలువుదీరిన దుర్గాలమ్మ పండుగను ఈ నెల 21న ఘనంగా నిర్వహించనున్నట్టు త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పండుగ సందర్భంగా గత మూడు రోజులుగా అమ్మవారి ఘటాలను బుచ్చిరాజుపాలెం పుర వీధుల్లో ఊరేగిస్తున్నారు. కాగా పండుగను మూడు సామాజిక వర్గాలైన గవర, రెడ్డి, యాదవులంతా సమష్టిగా నలభై ఏళ్లగా నిర్వహిస్తున్నారు.

చిత్రకళతో సృజనాత్మకత పెంపు

మల్కాపురం, మే 19: చిత్రకళ పోటీల్లో పాల్గొనడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని, ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం ఆమె శిబిరానికి విచ్చేసి మాట్లాడారు. 64 కళల్లో చిత్రకళ అత్యున్నత స్థానం ఉందని, చిత్రాన్ని ఆవిష్కరించడంలో గల నేర్పు, రంగుల కలయిక చిత్రకారుని ప్రతిభను, కళా దృష్టిని తెలియజేస్తాయన్నారు. రవివర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు వంటి ప్రముఖ చిత్రకారుల గురించి చిన్నారులు తెలుసుకోవాలన్నారు. అనంతరం 'వేసవి శిక్షణ శిబిరాలు' అనే అంశంపై సీనియర్ విద్యార్థులకు, 'అందమైన ప్రకృతి దృశ్యం' అనే అంశంపై జూనియర్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్, అంబేడ్కరీయులు సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 30, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 22, క్యారెట్ 28, దొండకాయలు 35, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296

జీతాలు చెల్లించకుంటే రేపు స్టీల్‌ప్లాంట్ హెచ్‌వోడీ కార్యాలయాన్ని దిగ్బంధిస్తాం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి

కూర్మన్నపాలెం, మే 19: కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించకపోతే ఈ నెల 21న స్టీల్‌ప్లాంట్ హెచ్‌వోడీ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,193వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఏడో తేదీలోగా స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలని చట్టం చెబుతున్నా ఇప్పటివరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

జీతాలు చెల్లించకపోతే కార్మికులంతా తమ కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు యాజమాన్యం సంస్థకు సంబంధించి పన్నులు, వడ్డీలు చెల్లిస్తుంది కానీ తమవద్ద డబ్బులున్నప్పటికీ కార్మికులను ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని మండిపడ్డారు. కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ కుట్రలో భాగంగానే కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్లాంట్ పరిరక్షణ కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా వెనకాడబోమన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగాల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తూ దుర్మార్గ పాలన సాగిస్తున్న కేంద్రానికి నూకలు చల్లే సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని విడనాడి స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఉక్కుటౌన్‌షిప్, మే 19: ఉక్కు కార్మాగారం పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని ప్రధాన విభాగాలైన కోకోవెన్, బ్లాస్ట్ ఫర్నేస్, మిల్స్, ఎస్ఎంఎస్ విభాగాలను ఆయన కార్మిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని విక్రయించేందుకు తీసుకున్న చర్యలు కుట్రపూరితమైనవన్నారు. ప్రజల ఆస్తిని అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్రోత్సాహాన్ని అందించాల్సింది పోయి అమ్మేందుకు చేస్తున్న చర్యలు దారుణమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యోగులంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆయన వెంట ఉక్కు కార్మిక నాయకులు జె.రామకృష్ణ, జి.ఆనంద్ ఉన్నారు.

అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ

85వ వార్డులో పలుచోట్ల పగలే లైట్లు వెలుగుతున్నా పట్టించుకోని అధికారులు

అగనంపూడి, మే 19: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, లంకెలపాలెం, పరిసర ప్రాంతాల్లో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. పలుచోట్ల వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలతో పాటు హైమాస్ట్ లైట్లు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. వార్డు పరిధిలో 90 శాతం లైట్లు వెలగడం లేదు. మిగిలిన పది శాతం లైట్లు పగలు, రాత్రుళ్లు వెలుగుతున్నాయి. ముఖ్యంగా ఫార్మాసిటీ పునరావాస కాలనీ, వినాయకనగర్, అగనంపూడి ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది.

మరమ్మతులకు గురైన లైట్ల గురించి పట్టించుకోకపోవడంతో పాటు పగటి పూట వెలుగుతున్న లైట్లను ఆర్పే నాథులే కరువయ్యారని వాపోతున్నారు. వీధి లైట్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్ల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఫార్మాసిటీ పునరావాస కాలనీలో వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

87, 88 వార్డుల్లో తరచూ విద్యుత్ సమస్యలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87, 88 వార్డుల సబ్‌స్టేషన్ల పరిధిలో తరచూ సాంకేతిక సమస్యల వల్ల రాత్రిపూట విద్యుత్ సరఫరా లేక ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు రహదారులు చీకటిమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరా సజావుగా లేకున్నా బిల్లులు మాత్రం తడిసి మోపెడవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా దువ్వాడ నుంచి మాతృశ్రీ నగర్, వుడా నగర్, కాపు జగ్గరాజుపేట, ఎల్ఎస్ గార్డెన్స్, ఎల్ఎం గార్డెన్స్, ఎస్టీబీఎల్ కాలనీ రహదారుల్లోని వీధి లైట్లు వీధి లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని చోట్లయితే అసలు వీధి దీపాలే లేవు. అసలే అధ్వానంగా ఉన్న రోడ్లలో రాత్రయ్యేసరికి వీధి దీపాలు లేక ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పెద్ద పెద్ద గోతుల్లో వాహనాలతో వెళ్లి కింద పడడం వల్ల పలువురు గాయాలపాలయ్యారు. అందువల్ల అధికారులు స్పందించి వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



శ్రీహరిపురంలో బస్టాప్ లేక షాపుల పక్కన వేచివున్న ప్రయాణికులు



ఎండకు తాళలేక పలువురు ప్రయాణికులు చెట్టు నీడన బస్సుల నిరీక్షిస్తున్న దృశ్యం

బస్టాప్‌లు లేక ప్రయాణికులు విలవిల

ఎండొచ్చినా.. వానొచ్చినా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పారిశ్రామిక ప్రాంత ప్రజల ఆవేదన

మల్కాపురం, మే 18: పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల బస్టాప్‌లు లేకపోవడంతో మండుటెండలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాప్‌లు లేనందున ఎండొచ్చినా, వానొచ్చినా నానాపాట్లు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మల్కాపురం, శ్రీహరిపురం, కోరమాండల్ గేటు, రామకృష్ణాపురం ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు బస్సుల కోసం నడిరోడ్డుపైనే బస్సుల కోసం వేచివుండాల్సి వస్తుంది.

మల్కాపురం నుంచి శ్రీహరిపురం వైపు వెళ్లే మార్గంలో బస్టాప్‌లు లేవు. అలాగే శ్రీహరిపురంలో రహదారులకు రెండుపక్కలా బస్టాప్‌లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనా బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఎండ వేడిమికి తాళలేక చాలామంది ప్రయాణికులు రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్ద నీడలో ఉంటున్నారు. కాగా రోడ్డుకు ఇరుపక్కలా వ్యాపార సంస్థలు ఉన్నందున తాము బస్టాప్‌లను ఏర్పాటు చేయలేకపోతున్నామని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రతిరోజు అనేక మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. కోరమాండల్ గేటు వద్ద, కోరమాండల్ నుంచి మల్కాపురం వైపు వెళ్లే మార్గంలోనూ బస్టాప్‌లు లేవు. అదేవిధంగా రామకృష్ణాపురం రిక్వెస్ట్ స్టాప్ వద్ద మాత్రం ఓ బస్టాప్ ఉన్నా, అది ఎందుకు ఉపయోగపడడం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పలుచోట్ల బస్టాప్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో హెచ్‌పీసీఎల్, కోరమాండల్, షిప్‌యార్డు వంటి భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల నిర్వాహకులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగానైనా ఇక్కడ బస్టాప్‌లను నిర్మించేందుకు ముందుకు రావాలని వేడుకుంటున్నారు.



గంటా శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

అనంత పద్మనాభునికి చందన అలంకరణ

పద్మనాభం, మే 19: పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన చందనోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. విష్ణుమూర్తికి ప్రీతికరమైన వైశాఖ మాసంలో కుంతీమాధవస్వామి మూలవిరాట్టుకు చందన అలంకరణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ముందుగా కుంతీమాధవస్వామికి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేపట్టారు. అనంతరం వేదపండితులు స్వామివారిని చందనంతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, వైసీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ రాంబాబు, పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు గాడు వెంకటప్పడు, తదితరులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వేపగుంట, మే 19: నాయుడుతోట అప్పలనర్సయ్యకాలనీలో టీడీపీ నాయకుడు పి.గోవిందరావు స్మారకార్థం సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నడక మైదానం వద్ద చలివేంద్రం ప్రారంభం

అగనంపూడి, మే 19: ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయ కూడలి నుంచి స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి రహదారిలో గల నడక మైదానం వద్ద ఆదివారం ఉక్కు యాజమాన్యం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకే ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి చేస్తామని వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గవర సోమశేఖర్, బెక్కం రామారావు, ఎం.నరసింగరావు, బి.సత్యనారాయణ, కె.పైడిరాజు, శంకరరావు, వీరునాయుడు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి తిరువీధి ఉత్సవంలో కోలాటం బృందం ప్రదర్శన

వైభవంగా వెంకటాద్రి శ్రీవారి తిరువీధి ఉత్సవం

పెందుర్తి, మే 19: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారి తిరువీధిని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల పల్లకీలో స్వామివారిని అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య వెంకటాద్రి శిఖరం నుంచి కొండ దిగువ చినముషిడివాడ సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయం వరకు తిరువీధి ఉత్సవాన్ని చేపట్టారు. తిరువీధి ఉత్సవం పులివేషాలు, కాళీమాత వేషధారులు, చిడతలు, కోలాటాలు, తదితర నృత్యాల నడుమ సందడిగా సాగింది. అనంతరం శ్రీవారు సంప్రదాయబద్ధంగా అలివేలు మంగాదేవికి పసుపుకుంకమలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం శ్రీవారిని వెంకటాద్రికి తీసుకువెళ్లారు.

జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ విజేతగా చిహ్నిక

గాజువాక, మే 19: కేరళలోని కాలికట్‌లో ఇటీవల జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పోటీల్లో గాజువాక ప్రాంతానికి చెందిన ఏడేళ్ల పి.చిహ్నిక విజేతగా నిలిచింది. జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలవడంతో ఆమె అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించింది. త్వరలో థాయిలాండ్‌లో జరగనున్న పోటీల్లో చిహ్నిక పాల్గొననున్నది. చిరుప్రాయంలోనే మోడలింగ్‌తో పాటు పలు రంగాలలో చిహ్నిక ప్రావీణ్యం సంపాదించింది.



జ్ఞాపికతో చిహ్నిక



అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, తదితరులు

ఘనంగా రోళ్ల పైడిమాంబ సారె ఊరేగింపు

పెందుర్తి-రూరల్, మే 19: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో నిర్వహిస్తున్న గ్రామ దేవత రోళ్ల పైడిమాంబ పండుగలో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపు చేపట్టారు. ఆలయ ధర్మకర్త అయిత ఎర్నిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల తినుబండారాలను సారె ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం రోళ్ల పైడిమాంబకు పూజలు చేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

అప్పన్న దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, మే 19: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమైన విశిష్టాద్వైత మత ప్రచారకులు నమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలను పురస్కరించుకుని ఈనెల 23 వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈఓ శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 22న నృసింహ జయంతి సందర్భంగా సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని, ఆయా రోజుల్లో రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరాలు

హనుమంతవాక, వడ్లపూడి రామాలయాల్లో నిర్వహణ

పెదగంట్యాడ, మే 19: తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు వేదర్షి అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు హనుమంతవాక జంక్షన్ భక్తతుకారాం రామాలయంలో, సాయంత్రం ఏడు నుంచి రాత్రి తొమ్మిది వరకు వడ్లపూడిలోని గవర రామాలయంలో ఈ శిబిరాలు జరగనున్నాయి. ఆరు నుంచి 90 ఏళ్ల వరకు వయసున్న వారంతా ఈ శిబిరాల్లో పాల్గొవచ్చునని గురు కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ట్రస్టు విశాఖ కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పండాను 9182972007 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్రూప్ 2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

విశాఖపట్నం, మే 19 : గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షల్లో పాసై, మెయిన్స్‌కు సిద్ధమవుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోగా పంపించాలని, 60 మందికి రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన ఏడుగురు అభ్యర్థులతో పాటు మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ (వార్షిక ఆదాయం రూ. లక్ష లోపు) పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జెరాక్స్, రెండు ఫొటోలు, గ్రూప్ 2 హాల్ టికెట్ జతపరిచి బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, సెక్టర్ 6, విశాఖపట్నం కార్యాలయానికి నేరుగా పంపిపంచాలని కోరారు. పూర్తి వివరాలకు 94925 69177 ఫోన్ నెంబరును సంప్రతించాలని ఆమె సూచించారు.

వేంకటేశ్వరస్వామికి వైశాఖ ఏకాదశి పూజలు



కూర్మన్నపాలెం, మే 19: జీవీఎంసీ 87వ వార్డు పరిధి రాజులపాలెంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలోని శ్రీవారి ఆలయంలో వైశాఖ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం వెంకన్న స్వామికి, ఉభయ దేవేరులకు పంచామృతాభిషేకాలు చేశాక ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వేపగుంట: ఇక్కడినాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలో ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణాన్ని భక్తులు పఠించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

టౌన్‌షిప్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 19: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని శ్రీగాయత్రి విశ్వకర్మ యజ్ఞం చేశారు. స్టీల్‌ప్లాంట్ అన్ని విధాల అభివృద్ధిలో ముందుకు సాగాలని, ఉద్యోగులకు, కార్మికులతో పాటు వారి కుటుంబాలకు మంచి జరగాలని పూజలు జరిపారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ విశ్వబ్రహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు ఉక్కు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీలో పలువురు చేరిక



బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మే 19: ప్రజలందరికి మేలు చేయడంతో పాటు దేశాన్ని ప్రగతిపథంలోకి తీసుకువెళ్లడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం గాజువాక ప్రాంతానికి చెందిన పలువురు బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో దగా పడిన ప్రజల కోసం మంచి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, రమణ, సురేశ్, హేమంత్, శ్రీను, పవన్, తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములను నిరుద్యోగులకు కేటాయించాలి

ఉక్కుటౌన్‌షిప్, మే 19: స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను నిర్వాసిత నిరుద్యోగులకు కేటాయించాలని టీఎన్‌టీయూసీ ఉక్కు అధ్యక్షుడు నమ్మి సింహాద్రి అన్నారు. టౌన్‌షిప్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి లభిస్తుందన్న ఆశతో నాడు నిర్వాసితులు తమ భూములను ఇచ్చారని, కానీ నేడు చాలామందికి ఇంకా ఉపాధే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ మిగులు భూములను ఉక్కు కర్మాగారం అభివృద్ధికి వాడాలని, కానీ కేంద్ర ప్రభుత్వం వాటిని విక్రయించేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. నాయకులు శ్రీనివాస్, నరేంద్ర, కన్నారావు, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే సంగీత కళాకారుల రాణింపు



అన్నమయ్య జయంత్యుత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ద్వారం త్యాగరాజు

సీతంపేట, మే 19: సరస్వతీ దేవి ప్రతిరూపమైన సంగీతాన్ని భక్తిశ్రద్ధలతో ఏకాగ్రతగా సాధన చేసిన వారే మంచి కళాకారులుగా రాణిస్తారని డాక్టర్ ద్వారం త్యాగరాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శృతిలయ వ్యవస్థాకులు వి.ప్రభాకర్ సారథ్యంలో ఆదివారం వాగ్గే యకారుడు అ న్నమాచార్యుని జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అన్నమాచార్య సంకీర్తనల పోటీలను నిర్వహించారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 300 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ద్వారం త్యాగరాజు జ్యోతి మాట్లాడుతూ తేనె వంటి తెలుగు ప దాలతో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని తన సంకీర్తనలతో కీర్తించిన ఘనత ఒక అన్నమాచార్యునికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎంఎస్ మాధవ్, కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, కె. మంజుల, శారద, సుజని తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆర్పీపేట పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

కంచరపాలెం, మే 19 : జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో 2006-2007 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకుని సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాలను విడిచి 17 ఏళ్ల గడిచినా అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు. నగరంతో పాటు రాష్ట్రం నలుమూలల ఉన్న విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలోపాల్గొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులు నారాయణరావు, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, అరుణకుమారి, హేనా, హరినాథ్,శ్వేత తదితరులను ఘనంగా సత్కరించారు. వారు నేర్పిన విద్యాబుద్ధులను గుర్తు చేసుకున్నారు. కుటుంబాలతో సందడిగా గడిపారు. డ్యాన్స్‌లతో ఉల్లాసంగా ఆనందం పంచుకున్నారు.

45 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

సీతమ్మధార, మే 19: నక్కవానిపాలెంలో ఏఎంసీ ఆసుపత్రి ఎదురుగాఉన్న భవనంలో పీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లైన్ బ్లడ్ బ్యాంక్ ట్రస్టు వైద్యులు పర్యవేక్షణలో దాతల నుంచి రక్తం సేకరించారు. సుమారు 45 మంది రక్తదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ పీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ సేవా కార్య క్రమాల్లో భాగంగా, స్వామి రవిశంకర్ 68వ జయంతిని పురస్కరించుకొని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ వి.సాంబశివరావు, సెక్రటరీ వీవీ రమణమూర్తి, కోశాధికారి జీ సాంబమూర్తి, పీ శ్రీనివాసరావు, లైన్‌బ్లడ్ బ్యాంక్ వైద్యులు సయ్యద్, సహాయకులు ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కంచరపాలెం, మే 19 : యువతి అదృశ్యంపై కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ల కేసు నమోదైంది. కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి జ్ఞానాపురం రాచవీధిలో నివాశంఉంటున్న కన్నెకంటి పద్మ భర్తతో విడిపోయి కుమార్తె కీర్తిక, బాబుతో కలిసి ఉంటున్నారు. కీర్తిక పదోతరగతి వరకు చదివి మధ్యలో ఆపేసి బట్టలదుకాణంలో పనిచేస్తుండేది. అయితే, బట్టల దుకాణం యజమాని ఇవ్వాల్సి డబ్బులు తీసుకువస్తానని తల్లికి చెప్పి శుక్రవారం మధ్యాహ్నం కీర్తిక బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి పద్మ బంధువులు, చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు నేతృత్వంలో ఎస్‌ఐ సమీర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యతను గాలికొదిలేశారు!

- 48ఏ బస్సు రూట్‌లో రూ. 9 కోట్ల నిధులతో రహదారి నిర్మాణం
- మూడు నెలలకే పలుచోట్ల ధ్వంసం
- నాసిరకంగా రోడ్డు మధ్య మ్యాన్‌హోల్ పనులు
- పెచ్చులూడుతున్న రోడ్డు అంచులు



ఉడా కాలనీ బస్టాపు ఎదుట చేపడుతున్న మరమ్మతులు

మాధవధార, మే 19 ; విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధి 48ఏ బస్సు రూట్‌లో ఇటీవల రూ. 9 కోట్ల నిధులతో నిర్మించిన రహదారి ఎక్కడికక్కడ మరమ్మతులతో అధ్వానస్థితిలో దర్శనమిస్తోంది. మాధవధార, ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి మురళీనగర్, కైలాసపురం మీదుగా సీతమ్మధార వరకు వేసిన ఈ బీటీ రోడ్డు మధ్యలో యూజీడీ మ్యాన్‌హోల్స్ క్యాప్‌లు ధ్వంసమవడంతో వాటిని ఆనుకుని ఉన్న రహదారి క్రమేపీ దెబ్బ తింటోంది. దీంతో రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక, మధ్యలో మరోసారి తవ్వకాలు చేపట్టి యూజీడీ మ్యాన్‌హోల్‌పై సిమెంట్ క్యాపులకు అతుకులు వేస్తున్నారు. ఈ ప్రదేశాల వద్ద నిర్మాణం పూర్తయిన రెండు నెలలకే చిందరవందరగా తయారయ్యాయి. ఈ నాణ్యత లోపించిన క్యాపుల నిర్మాణాలను చూస్తున్న వాహనదారులు, స్థానికులు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం వీటి నిర్వహణను తిరిగి మంచినీటి సరఫరా విభాగం ఏఈకి బదలాయించడంతో ఆ పనులు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంతో కలసి మళ్లీ పూర్తి చేస్తున్నారు. తొలుత కాంట్రాక్టులు రెండుగా విభజించి టెండర్లు కేటాయించి నిర్మాణం పూర్తిచేశారు. మాదవధార నుంచి ఆర్‌అండ్‌బీ వరకు 1.9 కిలోమీటర్లు, రెండోది మాధవధార నుంచి కైలాసపురం వరకు నిర్మించారు. అంతకు ముందు అక్కడి నుంచి సీతమ్మధార వరకు మరో కాంట్రాక్టుగా రోడ్డు పనులను త్వరత్వరగా ఎన్నికల ముందు జనవరిలోనే పూర్తి కానిచ్చారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ గడిచి ప్రస్తుతం మే నెల వచ్చే సరికి రోడ్డు రూపు మారి నిర్మాణాల్లో డొల్లతనం బయటపడుతోంది. మ్యాన్‌హోల్స్ క్యాపుల నుంచి సిమెంటు క్రషరు రాలి పోతున్నాయి. క్యాపుల చుట్టూ ఉన్న రోడ్డు అంచులు రాళ్ల పిక్కలు తేలి గోతులుగా మారింది. వీటిని కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు జీవీఎంసీ వాటర్ సప్లయి ఏఈ, ఇంజనీరింగ్ విభాగాల పర్యవేక్షణలో పనులు చేస్తున్నారు. విరిగిన మ్యాన్‌హోల్ క్యాపుల స్థానంలో కొత్త వాటిని అమరుస్తూ పనులు ఆరంభించారు. శనివారం మాధవధార ఉడాకాలనీ రోడ్డులో పనులు చేపట్టారు. అదే వరుసలో ఎన్‌జీజీఓస్ కాలనీ, మురళీ నగర్, మధుసూదన్‌నగర్ వరకు మరమ్మతు పనులు కానిస్తుండడం గమనార్హం.

ఘనంగా నూకాంబిక పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న కేకే రాజు తదితరులు

కంచరపాలెం, మే 19: జీవీఎంసీ 47వార్డు పరిధి పెదకొత్తూరులోని శ్రీ నూకాంబిక అమ్మవారి నెలవారి పండగను ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి భక్తులు ఘటాలతో ఊరేగింపు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. ఆది ఆంధ్ర యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఉత్తర వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు, చొక్కాకుల వెంకటరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ పురోభివృద్ధికి పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమౌళి

మురళీనగర్, మే 19 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి పేర్కొన్నారు. క్లబ్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల క్లబ్ నిర్వహణలో చిన్నారులకు ఉచిత చదరంగం శిక్షణను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. అలాగే, ఈనెల 23న క్లబ్‌లో బుద్ధ పౌర్ణమి, 26న ఉచిత వైద్యశిబిరం, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే, సభ్యులందరి సహకారంతో విరాళాల సేకరించి పార్కు నిర్వహణ ఫండ్ మరింత పెంచేందుకు కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రధానంగా వాకర్స్ ఇంటర్నేషన్ సాయంతో సొంత భవనం నిర్మాణం చేపట్టనున్నట్టు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు కార్యక్రమాల నివేదికను వెల్లడించారు. కోశాధికారి వాకర్ జె.కూర్మారావు రాబడి, ఖర్చుల వివరాల్ని క్లబ్ సభ్యులకు నివేదించారు. సమావేశంలో పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాదం, ఎం.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు



ఓ కాశివాసి రావయ్యా నాటికలో ఓ సన్నివేశం

కొత్తూరు, మే 19 : అనకాపల్లిలోని వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. పరిషత్ నిర్వాహకుడు పీసీహెచ్. నాయుడు, కేఎం నాయుడుల పర్యవేక్షణలో విశాఖపట్నం కాలాభినయ కళాకారులు ప్రదర్శించిన "ఓ కాశివాసి రావయ్యా", విజయవాడ హర్ష క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన "మనఃసాక్షి" నాటికలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఓ కాశివాసి రావయ్యా నాటిక మానవత్వపు విలువలు లోపిస్తున్న ఈ సమాజంలో ఎవరికి వాళ్లే కొరివి పెట్టుకునే రోజు వస్తుందని, రేపటి రోజును ఈ రోజే ఊహించి రాసిన నాటిక ఇది. అలాగే, మనఃసాక్షి.. ప్రతి మనిషికి మనఃసాక్షి ఉంటుంది. అది కుటుంబ సంస్కారాలు, సంప్రదాయాల వలన రూపుదిద్దుకుంటుంది. కానీ చంద్రశేఖర పాత్ర తన మనఃసాక్షికి భిన్నంగా ధనార్జనే జీవిత ధ్యేయంగా అక్రమంగా సంపాదిస్తుంటాడు. అదే డ బ్బు కోసం తన కొడుకు తండ్రి పంథాలో నడిచి తనకి కీడు చేస్తాడు. చంద్రశేఖరం పశ్చాతపడి డబ్బు శాశ్వతం కాదని నిర్ణయానికి వస్తాడు. మనిషికి కా వాల్సింది పిడికెడు మెతుకులు బారెడుగుడ్డ, ఆరడుగులు నేల మాత్రమే మనిషికి శాంతినిస్తుందనే సందేశాన్ని తెలిపేది 'మనఃసాక్షి' నాటిక.ఈ నాటికకు ర చన కీర్తిశేషులు డాక్టర్ పి.బ్రహ్మానందరావు, దర్శకత్వం కత్తి శ్యాంప్రసాద్ వహించారు.

కమనీయం... శ్రీవారి కల్యాణం



వేదికపై కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న పండితులు

మురళీనగర్, మే 19 ; నగరంలో ప్రసిద్ధి చెందిన మురళీనగర్ శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 22వ వార్షిక కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై మలయప్ప కల్యాణ వేడుకను ప్రధాన అర్చకులు శేషస్వామి ఆధ్వర్యంలో పూర్తిచేశారు. నగరంలోని పలు ప్రాంతాలు సహా మాధవధార, మర్రిపాలెం, మురళీనగర్, కంచరపాలెం ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తులు వేడుకల్లో హాజరయ్యారు. ఆలయ ఈవో బండారు.ప్రసాద్ ఉత్సవ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

హెచ్ఐవీ బాధితులకు అండగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతంపేట, మే 19: అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినం సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తుకు చేసుకుంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రా త్రి డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తన కార్యాలయం వద్ద ప్రారంభించారు. అనంతరం సత్యం కూడలి వరకు అక్కడి నుంచి రామాటాకీస్ వరకు ఈ ర్యాలీ సాగింది. ప్రేమ, సంఘీభావం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం అనే నినాదంతో ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఈ వ్యాధితో బారిన పడిన వారికి పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందించడమే కాకుండా వారికి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ క్షయ నిరవాణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా విద్యా విస్తరణ మీడియా అధికారి శైలజా భద్రి, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంట నడిచిన వారందరికీ అండగా ఉంటా: గంటా

సిరిపురం, మే 19: భీమిలి అసెంబ్లీ ఎన్నికల్లో తన వెన్నంటి ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులందరికీ తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన ఇన్‌చార్జిలు, నాయకులు, శ్రేయోభిలాషులతో వాల్తేర్ క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. తన కోసం ఎంతో అభిమానంతో పనిచేసే ఎన్నికల టీమ్ ఉండటం తన అదృష్టమన్నారు. కుటుంబ సభ్యుడు పోటీ చేస్తుంటే ఎలా కష్టపడతారో అంతకుమించి తన విజయం కోసం శ్రమించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, జూన్ 4న ఫలితాలు రూపంలో అది కనిపించబోతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడం జూన్ 9న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం తథ్యమన్నారు. భీమిలి నుంచి పోటీ చేయడానికి నాలుగున్నరేళ్ల కష్టపడి పార్టీని నడిపించిన కోరాడ రాజబాబు ఎన్నికల సమయంలో ముందుండి పనిచేశారని ప్రశంసించారు. భీమిలి నుంచి జనసేన తరఫున పోటీ చేయాలని పంచకర్ల సందీప్ ఆశించి పొత్తులో ఆ సీటు టీడీపీకి వదిలేసినప్పటికీ పూర్తి సహకారం అందించారన్నారు. బీజేపీ ఇన్‌చార్జి రామునాయుడు నిరంతరం తన వెంటే ఉంటూ మిత్రపక్ష స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ వార్డుల ఇన్‌చార్జిలను గంటా సన్మానించారు.

విస్కోలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఆమోదించాల్సి ఉంటుంది. కొన్ని పనులకు మాత్రం జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం అవసరమవుతుంది.

అంతా అతనే...

విస్కో ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన ఓ ఉద్యోగిని నియమించారు. ఈ ఉద్యోగంలో చాలామంది పనిచేసి మానేయగా, ఐదేళ్ల కిందట చేరిన అతడు జీవీఎంసీలోని కీలక అధికారిని ప్రసన్నం చేసుకున్నారు. ఆ అధికారి అండదండలను అలుసుగా తీసుకుని తాత్కాలిక ఉద్యోగి విస్కోని తన జేబు సంస్థగా మార్చుకున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నీటిసరఫరా విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)కి విస్కో నుంచి కారుని సమకూర్చారు. తాత్కాలిక ఉద్యోగి కూడా అదే మాదిరి కారుని తన కోసం విస్కో నిధులతోనే కొనుగోలుచేసుకున్నారు. అంతేకాకుండా విస్కో పరిధిలో ఏవైనా పనులు చేయాల్సి వస్తే, బోర్డు సభ్యుల ఆమోదం మేరకు ప్రతిపాదనలు చేసి కమిషనర్ ఆమోదం తీసుకుంటారు. తర్వాత టెండరు పిలిచి కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయిస్తారు. బిల్లులను కమిషనర్ ఆమోదానికి, అక్కడి నుంచి విస్కోలోని ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షించే తాత్కాలిక ఉద్యోగికి పంపిస్తారు.

కొర్రీలతో కాలయాపన

అన్ని పనులు పూర్తైన తరువాత బిల్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఏదో ఒక కొర్రీ వేసి చెల్లింపులు జరగకుండా తాత్కాలిక ఉద్యోగి ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నేరుగా అతనిని కలిసి కమీషన్ ఇస్తేనే బిల్లుకు మోక్షం కలుగుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కీలక అధికారి అండదండలతో విస్కోలోని ఇతర అధికారులను ఈ తాత్కాలిక ఉద్యోగం లెక్కచేయడం లేదని బాధిత అధికారులే ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కీలక అధికారి చెప్పిన పనులన్నీ చేసి పెడుతుండడంతో తాత్కాలిక ఉద్యోగి ఆటలకు అడ్డుచెప్పడం లేదని ఆరోపిస్తున్నారు.

అడ్డగోలు వ్యవహారాలు

జీవీఎంసీకి అవసరం లేకున్నా కీలక అధికారి చెప్పారనే కారణంతో విశాలక్షినగర్‌లో ఐఏఎస్ అధికారి భవనాన్ని గెస్ట్‌హౌస్‌గా అద్దెకు తీసుకున్నారు. దీనికి విస్కో నుంచి నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్న విషయం టీడీపీ, జనసేన నేతలు బయటపెట్టారు. కౌన్సిల్‌లో ప్రతిపాదన పెట్టాల్సి ఉన్నప్పటికీ తాత్కాలిక ఉద్యోగి తానే నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన జీ-20 సదస్సుకు సంబంధించి నగరంలో పచ్చదనం పెంపు, సుందరీకరణ పనులను అర్బన్ గ్రీన్‌కార్పొరేషన్ చేపట్టింది. ఆ బిల్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ విస్కో నుంచి చెల్లించారు. దీనికి సంబంధించిన చెక్కు కూడా బయటపెట్టడంతో జీవీఎంసీ కీలక అధికారి చెప్పిన కాంట్రాక్టర్లకు విస్కో నిధులను ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరింది. విస్కో నిధులను కేవలం నీటిసరఫరాకు సంబంధించిన పనులకు మాత్రమే బోర్డు అనుమతితో వెచ్చించాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ కీలక అధికారికి సహకరించేందుకు ప్రైవేటు వ్యక్తిని నియమించుకున్నారు. ఆ ఉద్యోగి జీతాన్ని విస్కో నుంచే చెల్లించడం తాత్కాలిక ఉద్యోగి పెత్తనానికి నిదర్శమని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల వేళ... యూజర్‌చార్జీలకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. గత ఏడాది నవంబరు నాటికి 32 శాతం వసూలు కాగా, డిసెంబరుకు 22.26 శాతానికి, జనవరి నాటికి 9.48 శాతానికి, ఫిబ్రవరినాటికి 14.44శాతానికి, మార్చి నాటికి ఆరు శాతానికి, ఏప్రిల్‌నాటికి 2.99శాతానికి పడిపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అధికార పార్టీకి మేలు చేయాలనే...

యూజర్ చార్జీల వసూలులో ప్రభుత్వంపై ఆదినుంచీ నగర వాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ఎన్నికల్లో వైసీపీ ఓట్లకు గండిపడుతుందని నాయకులు గుర్తించారు. దీంతో ఎన్నికల హడావుడి ప్రారంభమయినప్పటి నుంచే యూజర్ చార్జీల వసూలుపై ఉదాశీనంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అప్పటివరకూ లక్ష్యం మేరకు యూజర్ చార్జీలను వసూలు చేయని వార్డు సచివాలయం ఉద్యోగులపై సస్పెన్షన్లు, చార్జిమెమోలు జారీచేయడం వంటి తీవ్రమైన చర్యలు తీసుకున్న అధికారులు ఒక్కసారిగా ఆ విషయాన్ని విస్మరించడం దీనికి బలాన్ని చేకూర్చింది. యూజర్ చార్జీలు చెల్లించాలని ఒకవైపు సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్తే... అదే సమయంలో గడపగడపకూ మన ప్రభుత్వం పేరుతో వెళ్లిన వైసీపీ నేతలు, అధికారులు తిరుగుబాటు ఎదుర్కొనాల్సి ఉంటుందని గ్రహించే, వైసీపీ నేతలు ఈ నిర్ణయం తీసుకుని ఉంటారనే అభిప్రాయం వినిపిస్తోంది. వైసీపీ ఓట్లకు గండిపడకుండా ఉండేలా అధికారులు కూడా తమ వంతు సహకారం అందించి, స్వామి భక్తిచాటుకున్నారని పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

7.74 శాతమే!

... 5వ పేజీ తరువాయి

పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు పడ్డాయి.

అత్యధికంగా గోపాలపట్నం ఇందిరానగర్ బూత్ నంబరు 13లో 88.55 శాతం ఓటింగ్ జరిగింది. ఇంకా గవర కంచరపాలెంలో బూత్ నంబరు 191లో 88.2 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇదిలావుండగా కంచరపాలెంలోని ఐటీఐ జంక్షన్‌లో హ్యాపీ ఓమ్స్, మర్రిపాలెం, కాకానినగర్, మల్కాపురంలో అపార్టుమెంట్ ప్రాంతాలకు చెందిన బూత్‌లలో పోలింగ్ శాతం తగ్గిందని రాజకీయపార్టీల ప్రతినిధులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఈ సర్వేతో అనారోగ్య సమస్య ఉందని తెలియని ఎంతోమందిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆశా, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో వివరించారు.

చిమ్మచీకట్లో డాబాగార్డెన్స్ వీధులు

- వెలగని వీధిదీపాలు
- నిద్రావస్థలో జీవీఎంసీ సిబ్బంది



అంధకారంలో లక్ష్మీస్ట్రీట్



ప్రేమ సమాజం రోడ్డులో వాహనదారుల రాకపోకలు

డాబాగార్డెన్స్, మే 19: గ్రేటర్ 31వ వార్డు డాబాగార్డెన్స్ లోని పలు ప్రాంతాల్లో సాయంత్రమైతేచాలు చీకటి కమ్ముకుంటోంది. లక్ష్మీస్ట్రీట్, శారదాస్ట్రీట్ డౌన్, ప్రేమ సమాజం రోడ్డులోని గాడాంధకారం నెలకొనడంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే స్థానికులతోపాటు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారంతా అవస్థలు పడుతున్నారు. డౌన్ రోడ్డులోని ఒక్కసారి వాహనాలు రావడంతో ఎదుట ఎవరు వస్తున్నారో గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జీవీఎంసీ విద్యుత్‌దీపాల నిర్వహణ చూసే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంపై పలువురు ఆ గ్రహం వ్యక్తంచేస్తున్నారు. కనీసం రాత్రి వేళలో వీధి దీపాలు వెలుగుతున్నాయో లేదోనన్న పర్యవేక్షణ లేకపోవడంతో తిప్పలు పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా కోరుతున్నారు.

2న ఐటీఐ బ్రిడ్జి కోర్సు అభ్యర్థులకు పరీక్షలు

కంచరపాలెం, మే 19 : ఐటీఐ కోర్సులు పూర్తిచేసి బ్రిడ్జి కోర్సు శిక్షణ తీసుకున్న అభ్యర్థులు డిప్లొమా ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు వచ్చే నెల 2వ తేదీన పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను సాంకేతిక శాఖ విడుదల చేసింది. గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పరీక్ష ఉంటుంది. రాష్ట్రంలో ఈ పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలను కేటాయించింది. జోన్ పరిధిలో విశాఖపట్టణం కంచరపాలెంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా పరీక్షలు జరగనున్నాయి. బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్స్ పాసైన అభ్యర్థులు ఈ పరీక్ష కోసం దరఖాస్తుకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు రూ.400 ను ఆన్‌లైన్ ద్వారా ఈనెల 20వ తేదీ 28వ తేదీ వరకు చెల్లించవచ్చు. జూన్ రెండో తేదీ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు గణితం, మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30 వరకు ఫిజిక్స్, 3.45 నుంచి 5.15 వరకు కెమిస్ట్రీ సబ్జెకుల్లో పరీక్షను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో నిర్వహించనున్నారు. ఈపరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం డిప్లొమా ఇంజినీరింగ్ రెండో ఏడాదిలోకి ఐటీఐ అభ్యర్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

25న జిల్లా మహిళల క్రికెట్ జట్ల ఎంపిక

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 19: జిల్లా అండర్- 15, 19 మహిళల క్రికెట్ జట్ల ఎంపికలు ఈనెల 25న నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కే పార్థసారథి తెలిపారు. వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో ఆరోజు ఉదయం 7.00 గంటల నుంచి జరిగే ఈ ఎంపికలుంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఈనెల 24వ తేదీలోగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీడీసీఏ కార్యాలయంలో వయస్సు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అండర్-15 విభాగంలో పాల్గొనేవారు సెప్టెంబరు ఒకటి, 2009న లేదా ఆ తర్వాత, అండర్-19లో పాల్గొనేవారు సెప్టెంబరు ఒకటి, 2005న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు.

అల్లర్లకు దూరంగా ఉండాలి: ఎస్ఐ



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరావు

సీతంపేట, మే 19: నాలు గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్ సూచనలతో ఎస్ఐ వెంకటరావు ఈ కార్య క్ర మం చేపట్టారు. ఈసందర్భంగా రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, ఎలాంటి అల్లరు చేయకూడదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'దక్షిణం'లో కూటమి అభ్యర్థి గెలుపు తథ్యం'

అక్కయ్యపాలెం, మే 19 : దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపు తథ్యమని 27వ వార్డు టీడీపీ కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. తమ వార్డులో 2500ల ఓట్ల మెజారిటీతో వంశీకృష్ణ విజయం సాధించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు కూడా విశాఖకు తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. వైసీపీ దుర్మార్గ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్ శాతం కూడా బాగా పెరిగిందని తెలిపారు.



స్వర్ణ తులసీ దళాల నడుమ స్వామివారు

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, మే 19 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధి ష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణలు చేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ తులసీ దళాలతో అర్చన జరిపారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు



అమ్మవారికి పూజ చేస్తున్న భక్తులు

భీమునిపట్నం, మే 19 : పట్టణంలోని మంగమారిపేటలో ఆదివారం నుంచి ఎర్నిమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా వైశాఖ మాసంలో ఎర్నిమాంబ అమ్మవారితో పాటు ఏడుగురు అమ్మవార్లకు పసుపు కుంకుమ ఇవ్వడం ఆనవాయితీ. ఈమేరకు గ్రామస్తులు అమ్మవార్లకు మంగళస్నానం చేయించి, ప్రత్యేక అలంకరణలతో పూజలు, అభిషేకాలు జరిపారు. రెండు రోజుల పాటు ఉత్సవం జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సింహగిరిపై ఆయుర్వేద వైద్య శిబిరం

సింహాచలం, మే 19 : సుదీర్ఘకాలంగా కీళ్ల నొప్పులతో బాధపడే వారికి సిద్ధ ఆయుర్వేద మర్మ వైద్యంతో ఉపశమనం లభిస్తుందని ప్రకృతి ఆధారిత వ్యవసాయ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల పాటు తమ సంఘం ఆధ్వర్యంలో నృసింహవనంలో నిర్వహించిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. సుమారు నాలుగు వందల మంది కీళ్ల నొప్పులకు మందులు తీసుకున్నారని చెప్పారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, మే 19 : జీవీఎంసీ 98వ వార్డులోని అప్పన్నపాలెం, శ్రీనివాసనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీనివాసనగర్, గొల్లనారాయణపురం, ప్రహ్లాదపురం, అప్పన్నపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుష్ఠు రోగులకు దుస్తుల పంపిణీ

సింహాచలం, మే 19 : జీవీఎంసీ 98వ వార్డు విజినిగిరి పాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త విజినిగిరి బాల భానుమూర్తి ఆదివారం వ్యాలీ ఆఫ్ లవ్ కాలనీలో నివసిస్తున్న 40 మంది కుష్ఠు వ్యాధి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. సామాజిక సేవలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 34, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారేట్ 28, దొండకాయలు 35, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 150, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296

అనంతునికి చందన అలంకరణ

పద్మనాభం, మే 19 : పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన చందన అలంకరణ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. విష్ణుమూర్తికి ప్రీతికరమైన వైశాఖ మాసంలో కుంతీమాధవస్వామి మూలవిరాట్టుకు చందన అలంకరణోత్సవం నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది.ఈమేరకు ముందుగా కుంతీమాధవస్వామికి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేపట్టారు.అనంతరం వేద పండితులు స్వామివారిని చందనంతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, వైసీపీ భీమిలి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ రాంబాబు, పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు గాడు వెంకటప్పడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, పద్మనాభం, మద్ది సర్పంచులు పాప, సన్యాసమ్మ, ఇతర నాయకులు కూడా స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.



భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

చెరువు చేపలకు గిరాకీ

- సముద్రంపై వేట నిషేధమే కారణం
- నగర వ్యాప్తంగా ఇదే పరిస్థితి

వెంకోజీపాలెం, మే 19 : సముద్రంపై చేపల వేట నిషేధం కొనసాగుతుండడంతో చెరువు చేపలకు డిమాండ్ నెలకొంది. నిషేధం పూర్తయి సముద్రం చేపలు మార్కెట్‌కు చేరడానికి ఇంకా నెల రోజులు పట్టనుంది. దీంతో నగరంలోని అన్ని చేపల మార్కెట్లలోనూ చెరువు చేపలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. హెచ్‌బీ కాలనీ, చుట్టు పక్కల ప్రాంతాల్లోని చేపల బజార్లలో టన్నుల కొద్దీ చేపల వినియోగం జరుగుతోంది. సాధారణంగా సముద్రం చేపలు తక్కువ ధరకు లభిస్తాయి. అదే చెరువు చేపలు అయితే కిలో రూ. 100 నుంచి రూ. 150 వరకు ఉంటాయి. చేపలకు ఉన్న డిమాండ్ బట్టి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల చెరువుల నుంచి వ్యాపారులు చేపలు దిగుమతి చేస్తున్నారు. ప్రధానంగా ఆదివారం, మంగళవారం, బుధవారం దిగుమతి అధికంగా ఉంటుంది. విశాఖ జిల్లాలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌తో పాటు తగరపువలస, ఆనందపురం, దేవరాపల్లి, ఎస్. కోట ప్రాంతాల్లోని చెరువులు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న చెరువుల్లో పెరిగిన చేపలకు మంచి డిమాండ్ ఉంది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే చేపల లోడ్‌లు రాంపురం వద్ద ఉన్న హోల్ సేల్ మార్కెట్ యార్డ్‌కు చేరి అక్కడి నుంచి నగరంలోని రిటైల్ మార్కెట్‌కు చేరుతాయి. ప్రస్తుతం బంగారు పాప, బొచ్చు, శీలావతి, జడ్డువ, చందువ రకాల చేపలకు గిరాకీ బాగుంది. చేపల రకాలు, సైజును బట్టి ధర ఉంటుంది. కిలోకి తక్కువగా ఉన్న చేపలకు ఒక రేటు, ఎక్కువగా ఉన్న వాటికి ఒక రేటు నిర్ణయిస్తారు. మొత్తం మీద కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలుకుతుది.. చేపల్లో పోషక విలువలు అధికంగా ఉండడంతో మాంసాహార ప్రియులు ధర కాస్త అటు ఇటుగా ఉన్నా చెరువు చేపల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు డామ్ చేపలైన కొరమేను, గొరస తదితర చేపలకు కూడా డిమాండ్ ఉంది.



హెచ్‌బీ కాలనీ మార్కెట్‌లో చెరువు చేపల విక్రయం

ద్విచక్ర వాహనాల్లో పెట్రోలు చోరీ

సాగర్‌నగర్, మే 19 : జీవీఎంసీ 8వ వార్డు ముసలయ్యపాలెం కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ద్విచక్ర వాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు చోరీ చేస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న వారు తమ ద్విచక్రవాహనాలను రాత్రి వేళ కింద రోడ్డు పక్కన పార్కు చేస్తుంటారు. మొదట్లో ఒకటి రెండు బైక్‌ల నుంచి పెట్రోల్ తీసేవారు. శనివారం రాత్రి ఏకంగా 14 బైక్‌ల నుంచి పెట్రోలు చోరీ చేయడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు.

ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారులు

ఆరిలోవ, మే 19 : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో జరిగింది. ఎన్నికల పరిశీలకులు అల్లంపల్లి రాజబాబు, కొరికాన మోహన్‌రావు, పి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 126 మంది సభ్యులు ఉండగా 117 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా పల్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నాగులాపల్లి రవికుమార్, గౌరవ అధ్య క్షులుగా కొరకాన మోహన్‌రావు, సాయికుమార్, ముఖ్య సలహాదారులుగా అల్లం పల్లి రాజుబాబు, సలహాదారుడిగా గుడిపాటి విక్టర్ ఎన్నికయ్యారు.

అప్పన్న దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, మే 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమైన విశిష్టాద్వైత మత ప్రచారకులు నమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలను పురస్కరించుకుని ఈనెల 23 వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 22న నృసింహ జయంతి సందర్భంగా సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని, ఆయా రోజుల్లో రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేసినట్టు ఆయన చెప్పారు.

22న నృసింహ జయంతి, స్వాతి హవనం

సింహాచలం, మే 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఈనెల 22న సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నృసింహ జయంతి, స్వాతి హవనాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతి హవనంలో పాల్గొనే భక్తులు సింహగిరిపై దేవస్థానం పీఆర్ఓ కార్యాలయంలో రూ.2500 చెల్లించి టికెట్లు పొందవచ్చునని, పరోక్షంగా పాల్గొనే వారు ఆన్‌లైన్‌లో దేవస్థానం వెబ్‌సైట్‌లో టికెట్లు పొందవచ్చునన్నారు.

'తోట త్రిమూర్తులను అనర్హుడుగా ప్రకటించాలి'

సిరిపురం, మే 19 : పీసీఆర్ చట్ట ప్రకారం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని విదసం ఐక్యవేదిక ప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరారు. ఆదివారం వారు విశాఖ ఎయిర్ పోర్టులో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక కన్వీనర్ డా. బూసి వెంకటరావు మాట్లాడుతూ త్రిమూర్తులు నేర చరిత్ర, వెంకటాయపాలెం శిరో మండనం కేసులో జైలు శిక్షపడిన విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకువచ్చి 1955 పీసీఆర్ చట్ట ప్రకారం పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో విదసం ఐక్యవేదిక సభ్యులు బల్ల కుమార్, జాబి ఓంకార్, శామ్యూల్ కుమార్ పాల్గొన్నారు.

గ్రూప్ 2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మే 19 : గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షల్లో పాసై, మెయిన్స్‌కు సిద్ధమవుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోగా పంపించాలని, 60 మందికి రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన ఏడుగురు అభ్యర్థులతో పాటు మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధృవీకరణ (వార్షిక ఆదాయం రూ. లక్ష లోపు) పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, రెండు ఫొటోలు, గ్రూప్ 2 హాల్ టికెట్ జతపరిచి బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, సెక్టర్ 6, విశాఖపట్నం కార్యాలయానికి నేరుగా పంపిపంచాలని కోరారు. పూర్తి వివరాలకు 94925 69177 ఫోన్ నెంబరులో సంప్రతించాలని ఆమె సూచించారు.

సింహగిరిపై లిఫ్ట్ సౌకర్యం దుర్వినియోగం

సింహాచలం, మే 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి ప్రధాన రాజగోపురానికి సమీపంలో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్ సౌకర్యాన్ని ఆలయ సిబ్బంది దుర్వినియోగం చేస్తున్నారు. ఉదయం 6.30 గంటలకు దర్శనాలు ప్రారంభమైన సమయం నుంచి ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్, పోలీసులు, తదితరులు సక్రమంగా ఉన్నవారిని కూడా లిఫ్ట్ ద్వారా పంపిస్తున్నారు. దీనివల్ల వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. లిఫ్ట్‌లో వెళ్లేందుకు వారికి ఖాళీ లేక కింద పడిగాపులు పడుతున్నారు.

కాగా గతంలో ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే పీఆర్ఓ ఆఫీసు సిబ్బంది ఆలయ ప్రధాన రాజగోపురం ద్వారా లోపలికి అనుమతించేవారు. ఇటీవల రాజగోపురం ప్రవేశం సామాన్యులకు కూడా రాజమార్గంగా మారింది. ఈ మార్గంలో వెళ్లేవారిలో 99 శాతం మంది ఎటువంటి టికెట్లు లేకుండా ఉచితంగా ప్రవేశాలు చేయడంతో అప్పన్న ఖజానాకు వేలాది రూపాయల ఆదాయం గండి పడుతోంది. దర్శనానికి వచ్చిన భక్తులు ప్రధానంగా శ్రీఘ్రదర్శనం, అతిశ్రీఘ్రదర్శనం క్యూలో వచ్చిన వారి టికెట్లను ఆలయంలో చెక్ చేసే విధానం లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీన్ని అరికట్టేందుకు గత ఈఓలు దర్భముళ్ల భ్రమరాంబ, సూర్యకళ ప్రయత్నించి చాలావరకు సఫలీకృతులయ్యారు. ప్రస్తుతం ఈఓ కూడా ఈ సమస్యపై దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.



లిఫ్ట్ సౌకర్యం ఉన్నా.. మెట్లపై నుంచి నడిచివెళ్తున్న వద్ధురాలు

జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం

- రేపు స్టీల్‌ప్లాంట్ హెచ్‌వోడీ కార్యాలయం దిగ్బంధం
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు రామస్వామి

కూర్మన్నపాలెం, మే 19 : కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించకపోతే ఈనెల 21న స్టీల్‌ప్లాంట్ హెచ్‌వోడీ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు. రామస్వామి హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,193వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఏడో తేదీలోగా స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలని చట్టం చెబుతున్నా ఇప్పటివరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు.జీతాలు చెల్లించకపోతే కార్మికులంతా కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉక్కు యాజమాన్యం సంస్థకు సంబంధించి పన్నులు, వడ్డీలు చెల్లిస్తుంది కానీ తమ వద్ద డబ్బులున్నప్పటికీ కార్మికులను ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని మండిపడ్డారు.కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ కుట్రలో భాగంగానే కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్లాంట్ పరిరక్షణ కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా వెనకాడబోమన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న బీజేపీకి నూకలు చెల్లే సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరి వీడి ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఉక్కుటౌన్ షిప్, మే 19 : ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని ప్రధాన విభాగాలైన కోకోఓవెన్, బ్లాస్ట్ ఫర్నేస్, మిల్స్, ఎస్ఎంఎస్ విభాగాలను ఆయన కార్మిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని విక్రయించేందుకు తీసుకున్న చర్యలు కుట్రపూరితమైనవన్నారు. ప్రజల ఆస్తిని అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. ప్లాంట్‌కు ప్రోత్సాహాన్ని అందించాల్సింది పోయి అమ్మేందుకు చేస్తున్న చర్యలు దారుణమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యోగులంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఉక్కు కార్మిక నాయకులు జె.రామకృష్ణ, జి.ఆనంద్ ఉన్నారు.



ప్యాకెట్లు కోసం బారులు తీరిన భక్తులు

ఒలుపు చందనానికి డిమాండ్

సింహాచలం, మే 19 : అప్పన్న ఒలుపు చందనానికి భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది ఇప్పటికే రెండు రోజుల పాటు ఒక్కొక్కరికి ఒకటి చొప్పున రెండు వేల ప్యాకెట్లు విక్రయించారు. ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఏఈఓ ఎస్. ఆనందకుమార్, పర్యవేక్షణాధికారులు పిళ్లా శ్రీనివాసరావు, వెంకటరమణ స్వయంగా కౌంటర్లలో ఉండి విక్రయాలు చేపడుతున్నారు. సోమ, మంగళవారం కూడా రోజుకు వెయ్యి ప్యాకెట్లు విక్రయించనున్నట్టు అధికారులు ముందుగానే ప్రకటించారు. ప్రతిరోజూ కౌంటర్‌లో వెయ్యి ప్యాకెట్లు విక్రయిస్తున్నా..దానికి మూడింతల మంది భక్తులు సూర్యోదయానికి ముందు నుంచే క్యూలో బారులు తీరుతున్నారు.

రెండో రోజు 38 కిలోల చందనం అరగదీత



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం, మే 19 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 23న రెండో విడత చందనం సమర్పించనున్నారు. ఈమేరకు ఆదివారం 18 మంది నాల్గవ తరగతి సిబ్బంది ప్రత్యేక శిలలపై సుమారు 38 కిలోల చందనపు ముద్దను అరగదీశారు. తొలిరోజు 41 కిలోలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 79 కిలోల చందనం అరగదీశారు. సిబ్బంది అరగదీసిన పచ్చి చందనపు ముద్దను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు.

రైతు బజారులో సౌకర్యాలు పరిశీలన



రైతుబజారును పరిశీలిస్తున్న మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు

ఎంవీపీ కాలనీ, మే 19 : ఎంవీపీ కాలనీలోని రైతు బజారును మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. శేఖర్‌బాబు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతు బజారు అధికారులను భారత్ చెన దాల్, మార్క్ ఫెడ్ ఉత్పత్తుల అమ్మకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతు బజారు అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

వెంకన్నను దర్శించుకున్న వెలగపూడి



వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు

ఎంవీపీ కాలనీ, మే 19 : తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుటుంబ సమేతంగా తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు. ఆదివారం ఆయన సతీసమేతంగా తిరుమల వెళ్లి, ఆలయ ఆవరణలో కాసేపు సేదతీరారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం దంపతులు కూడా వెళ్లారు.

ఆదర్శప్రాయుడు.. పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నేతలు

తగరపువలస, మే 19 : ప్రజల చేతికి అధికారం రావాలంటే గ్రామ స్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలంగా ఉండాలని నమ్మిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం చిట్టివలసలోని ఆ సంఘం కార్యాలయంలో సీపీఎం నాయకులు సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎస్. అప్పలనాయుడు, ఆర్. నరసింగరావు మాట్లాడుతూ యువత గ్రామ సభల్లో భాగస్వామ్యులైతే స్థానిక పరిపాలన ఎంతో బాగుంటుందని సుందరయ్య చెప్పేవారని, కాని ప్రస్తుత ప్రభుత్వాలు దాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఆయన రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న పుస్తకంలో అనేక అంశాలు యువతకు ఎంతో ఆదర్శనీయమని చెప్పారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కర్రి రాము,జీరు సత్యం, కానూరి రమణ, ఆనంద్, సూరిబాబు, సన్యాసప్పడు పాల్గొన్నారు.

రాజకీయాలకు వన్నె తెచ్చిన నేత ..

ఆరిలోవ : రాజకీయాలకు వన్నె తెచ్చిన నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం ఆరిలోవ కార్యదర్శి నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం బీఎస్ఆర్ నగర్‌లో సుందరయ్య 39వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య ఉన్నత కుటుంబంలో పుట్టినా నిత్యం పేదల అభివృద్ధికి కృషి చేశారన్నారు. తనకు పిల్లలు పుడితే ప్రజా సేవకు ఆటంకం కలుగుతుం దని ప్రజలనే తన పిల్లలుగా భావించారని చెప్పారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. ప్రియాంక, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బాలికల వసతి గృహం రోడ్డు

ఆనందపురం, మే 19 : ఆనందపురం పంచాయతీ పరిధిలోని శ్రమజీవుల కాలనీ, ఎస్సీఎస్టీ బాలికల వసతి గృహానికి వెళ్లే రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. 1995లో వసతి గృహం నిర్మించినప్పుడు ఈ రోడ్డు వేశారు. కాలక్రమేనా రోడ్డుకు ఇరువైపులా శ్రమజీవుల కాలనీ ఏర్పడడంతో వాహనాల రద్దీ అధికమైంది. దీనికి తోడు నాటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రోడ్డు పూర్తిగా పాడైంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు వెళ్లడంతో ఎనిమిది నెలలు క్రితం రూ. 8 లక్షల మండల పరిషత్ నిధులతో కొంతమేర గ్రావెల్ పోసి చదును చేసే పనులు చేపట్టారు.కానీ ఈ పనులను కూడా మధ్యలో ఆపేశారు. కాగా రోడ్డుకి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరు వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో రహదారి మరింత అధ్వానంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.